# నవతరం
నేటితరం కోసం...

హైదరాబాద్ | బుధవారం, జనవరి 7, 2026 | సంపుటి:11 | సంచిక : 258 | పేజీలు: 8 | వెల : రూ.5





## తమిళనాడులో ఎన్డీఏకు సంక్లిష్ట పరిస్థితి

::: అమిత్‌షా, పళనిస్వామి మధ్య భిన్న సంకేతాలు

## మదురో దంపతులపై అంతర్జాతీయ కలకలం



- అమెరికా కోర్టులో మదురో దంపతుల హాజరు
- తాము నిర్దోషులమన్న మదురో దంపతుల వాదన
- విచారణ మార్చి నెలకు వాయిదా
- మదురోపై స్విట్జర్లాండ్ కీలక నిర్ణయం
- అంతర్జాతీయ రాజకీయాల్లో ప్రభావం

2లో

## అబద్ధపు హామీలతో మోసం



- కేసీఆర్ స్థాయికి రేవంత్‌రెడ్డి సరిపోడు
- రాహుల్ లీడర్ కాదు.. స్క్రిప్టు చదివే రీడర్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

2లో



2లో

## వెనిజులాలా పీఓకేపై దాడి చేయాలి..

ప్రధాని మోడీకి పీఓకే శరణార్థుల లేఖ..

మదురోలా సలాహుద్దీన్‌ను పట్టుకోవాలని విజ్ఞప్తి..




## ఏ విచారణకైనా రెడీ

- పారిశ్రామికవాడల్లోని భూముల వినియోగ మార్పిడిపై విచారణకు సర్కారు సిద్ధం
- 2014 నుంచి హిల్ట్‌పీ వరకు.. ప్రతిపక్షాలు లేఖ రాస్తే చాలు
- ఆ మరుక్షణమే ఏ విచారణ సంస్థతో కావాలంటే ఆ సంస్థతో విచారణ
- శాసనసభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మేము తెచ్చిన హిల్ట్ పాలసీలో దోపిడీకి ఆస్కారం లేదు
- పారిశ్రామికవాడల నుంచి కాలుష్య పరిశ్రమలను ఎట్టి పరిస్థితుల్లోనూ తరలిస్తాం
- కాలుష్య రహిత నగరాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యమన్న డిప్యూటీ సీఎం
- శాసనసభ నిరవధిక వాయిదా

2లో

# రైతుల సమక్షంలోనే సర్వే జరగాలి

- రీ సర్వేలో అభ్యంతరాలను పరిశీలించండి
- క్షేత్రస్థాయికి వెళ్లి పక్కాగా పర్యవేక్షించండి
- కీలకాంశాలపై రైతులకు స్పష్టత ఇవ్వండి
- రైతు సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం
- వారికి జవాబుదారీగా ఉండాల్సిందే
- రెవెన్యూ అధికారులకు ఆదేశాలు




అమరావతి:"భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో సమస్యలు ఎందుకొస్తున్నాయి? ఇందుకు కారణమెవరు? పాసు పుస్తకాల జారీలో కీలకమైన అంశాల్లో తప్పులు రావడమేమిటి? ఇవన్నీ ముందే చూసుకోవాలి కదా!?" అంటూ రెవెన్యూ వర్గాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. జగన్ హయాంలో జరిగిన రీసర్వేలో తప్పుల తడకలు, వాటిని సరిదిద్దకుండానే ఇప్పుడు పాస్ పుస్తకాలు జారీ చేయడం, ఇతర కీలక అంశాలపై 'ఆంధ్రజ్యోతి' ఇటీవల వరుస కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో... మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి దీనిపై రెవెన్యూ మంత్రి, సీసీఎల్ఏ, ఇతర అధికారులతో ఆకస్మికంగా

- మిగతా 2వ పేజీలో

## సోషల్ మీడియాలో రెచ్చిపోతే

# ఇక కఠిన చర్యలే



- సోషల్ మీడియాలో విద్వేషపూరిత వ్యాఖ్యలపై కఠిన చర్యలు
- సద్విమర్శలను స్వాగతిస్తాం, కుట్రపూరిత పోస్టులను సహించబోమన్న లోకేశ్
- మహిళలపై అసభ్య పోస్టులు పెట్టేవారిపై ప్రత్యేక నిఘా
- ఇతర దేశాల చట్టాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచన

2లో



## కవిత రాజీనామాకి ఆమోదం

- కవిత రాజీనామాకు మండలి ఛైర్మన్ ఆమోదం
- ఇటీవల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కవిత
- నిజామాబాద్ లోకల్‌బాడీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన కవిత

కల్వకుంట్ల కవిత తన ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామా అంశం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.. అయితే.. నిజామాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె, తన రాజీనామా లేఖను ఇప్పటికే

- మిగతా 2వ పేజీలో

# కవిత రాజీనామాకి ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

శాసనమండలి చైర్మన్‌కు సమర్పించారు. ఈ నేపథ్యంలో, సోమవారం శాసనమండలి వేదికగా ఆమె చేసిన ప్రసంగం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించింది. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేసిన నేపథ్యంలో, ఆ పార్టీ తరఫున గెలిచిన పదవిలో కొనసాగడం నైతికంగా సరికాదన్న ఉద్దేశంతోనే తాను రాజీనామా చేస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. నిజానికి తాను గతేడాది సెప్టెంబర్ లోనే రాజీనామా లేఖను సమర్పించినట్లు గుర్తుచేసిన కవిత, దాన్ని వెంటనే ఆమోదించాలని మండలి చైర్మన్‌ను కోరారు. అయితే, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఈ నిర్ణయంపై స్పందిస్తూ, భావోద్వేగంతో రాజీనామాలు చేయవద్దని, మరోసారి పునరాలోచించుకోవాలని ఆమెకు సూచించారు. అయినప్పటికీ, తన రాజీనామాకే కట్టుబడి ఉన్నానని కవిత తెలపడం గమనార్హం. అయితే.. తాజాగా మంగళవారం మండలి నిరవధిక వాయిదా పడింది. ఈ క్రమంలోనే కవిత రాజీనామాకు మండలి చైర్మన్ ఆమోదం తెలిపారు. మండలిలో వీడ్కోలు ప్రసంగం ముగించిన అనంతరం ఆమె తన భవిష్యత్తు కార్యాచరణను కూడా ప్రకటించారు. బీఆర్ఎస్ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, తన సొంత సంస్థ 'తెలంగాణ జాగృతి'ని ఒక రాజకీయ వేదికగా మార్చి ప్రజల్లోకి వెళ్తానని వెల్లడించారు. 2028-29 ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

# అబద్ధపు హామీలతో మోసం

జనగామ: 'వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రైతుబంధును రూ.15 వేలకు పెంచుతానన్నారు. కౌలుదారులకు కూడా ఇస్తానన్నారు. ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇస్తానన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. ఇవన్నీ అబద్ధాలు. అలాంటి హామీలు ఇచ్చి మోసం చేసిన రాహుల్‌గాందీనే నడిబజారులో ఉరితీయాలి..'అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి_.తారక రామారావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీ లీడర్ కాదని, దేశంలో ఏకైక స్క్రిప్టు చదివే రీడర్ అని విమర్శించారు. స్క్రిప్టులో ఏమున్నా చదివేసే అవగాహన లేని నేత అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందా? ఊడుతుందా? తెలియని పరిస్థితి ఉందన్నారు. సీఎంకు కూడా మూటలు మోసిన అనుభవం తప్ప మరేమీ లేదని, ఏమీ తెలియదని వ్యాఖ్యానించారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లాలో గెలుపొందిన బీఆర్ఎస్ సర్పంచుల అభినందన సభలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'రాష్ట్రంలో చెక్‌డ్యాంలు పటాకులు పేలినట్లు పేలుతున్నాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అట్లనే ఉంది. రాష్ట్రంలో పాలిచ్చే బర్రెను కాదనుకుని, వెనకనుంచి తన్నే గేదెను తెచ్చుకున్నామని ప్రజలు మథనపడుతున్నారు. గోదావరి ఎక్కడుందో కూడా రేవంత్‌కు తెలియదు. భాక్రానంగల్ ప్రాజెక్టు తెలంగాణలో ఉందని చెబుతున్న రేవంత్‌రెడ్డి..రాష్ట్రాన్ని ఎలా నడిపిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అవుతోంది.. ప్రజలకు చేసిన వాగ్దానాలు ఎంతవరకూ నెరవేర్చారో ఒక్కసారి ఆలోచించాలి. ఎనకటి రోజులు తెస్తానన్న రేవంత్, రాబందు కాలం తీసుకువచ్చారు. తెలంగాణను అభివృద్ధి చేసిన నాయకుడిని (కేసీఆర్)ఉరి తీయాలంటారా?. ఇంటింటికీ నీళ్లు ఇచ్చి, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, సాగునీటి ప్రాజెక్టులతో తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టిన కేసీఆర్‌ను ఉరి వేయాలని రేవంత్‌రెడ్డి అనడం చూస్తుంటే ఆయనకు పిచ్చి ముదిరి పాకాన పడిందని అర్థమవుతోంది. ఆ మాటకొస్తే హామీలు ఇచ్చి మోసం చేసిన రాహుల్‌గాంధీనే ఉరి తీయాలి. తన సొంత సెక్యూరిటీని కూడా ప్రజల ముందే కొట్టే ముఖ్యమంత్రి ఎక్కడా దొరకడు. తెలంగాణ తెచ్చిన మొనగాడు కేసీఆర్ చెప్పు దూళికి రేవంత్ సరిపోడు. కేసీఆర్ ఒక్క ప్రెస్‌మీట్‌కే ఆయన ఆగమాగం అవుతున్నాడు. ఇక అసెంబ్లీలో మాట్లాడితే అక్కడే గుండె ఆగిపోయి సచ్చిపోతారు..'అని కేటీఆర్ విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెనిజులాలా పీఓకేపై దాడి చేయాలి..

పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ పై దాడి చేయాలని ప్రధాని నరేంద్రమోడీకి పీఓకే శరణార్థులు లేఖ రాశారు. ఇటీవల వెనిజులాపై అమెరికా దాడి చేసినట్లే, పీఓకేకు విముక్తి కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. పీఓకే నుంచి నిరాశ్రయులైన వ్యక్తులు, పీఓకే ప్రాంతంలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై నిర్ణయాత్మక, సాహసోపేత దాడిని ప్రారంభించాలని ప్రధానిని కోరారు. పీఓకే శరణార్థులకు ప్రాతినిధ్యం వహిస్తున్న జూూ ఇంటర్నేషనల్ సంస్థ ప్రధాని మోడీకి ఈ లేఖ రాసింది. పీఓకే ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చివేసి హిజ్బుల్ ముజాహీదీన్ చీఫ్ సయ్యద్ సలావుద్దీన్‌ను పట్టుకోవడానికి సర్జికల్ స్ట్రైక్ చేయాలని ఆ సంస్థ చైర్మన్ రాజీవ్ చుని అన్నారు. వెనిజులాలో అమెరికా ఆపరేషన్, అధ్యక్షుడు నికోలస్ మదురోను ఉదాహరణగా చూపుతూ, భారత దళాలు సలావుద్దీన్‌ను పట్టుకుని, బంధించి, భారతదేశానికి తీసుకురావాలని తాను కోరుకుంటున్నానని చుని అన్నారు. పీఓకేను ఉగ్రవాదులు, డ్రగ్స్, ఆయుధాలకు లాంచ్ ప్యాడ్స్‌గా ఉపయోగిస్తున్నారని, ఇది భారత భద్రతకు ముప్పుగా ఉందని ఆయన చెప్పారు. అంతర్జాతీయ సమస్యల కన్నా జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పీఓకేను విముక్తి చేసి, దానిని భారత్‌లో కలపాలని లేఖలో కోరారు.

# సోషల్ మీడియాలో రెచ్చిపోతే ఇక కఠిన చర్యలే

సోషల్ మీడియా వేదికగా కుట్రపూరితంగా విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై ఉక్కుపాదం మోపుతామని, అటువంటి వారిపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వ నిర్ణయాలపై వచ్చే సద్విమర్శలను మనస్ఫూర్తిగా స్వాగతిస్తామని, అయితే వాక్ స్వాతంత్ర్యం (ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్) పేరుతో వ్యవస్థీకృతంగా చేసే దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. అమరావతి సచివాలయంలో ఃసోషల్ మీడియా జవాబుదారీతనం, పౌరుల రక్షణః అనే అంశంపై ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... "వ్యక్తిత్వ హననానికి పాల్పడటం, మహిళలను కించపరిచేలా అసభ్యకర పోస్టులు పెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డీప్ ఫేక్ కంటెంట్‌ను అరికట్టాలి. మహిళలపై అవమానకరమైన పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. ప్రజాభిప్రాయాన్ని అడ్డుకోవడం మా ఉద్దేశం కాదు. కానీ, కొందరు విదేశాల్లో ఉంటూ ఇక్కడి సామాజిక సామరస్యానికి భంగం కలిగించేలా పోస్టులు పెడుతున్నారు.

# మదురో దంపతులపై అంతర్జాతీయ కలకలం

వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన భార్య సిలియా మదురో వ్యవహారం అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఆకస్మిక పరిణామాల మధ్య అమెరికా ప్రభుత్వం మదురో దంపతులను సోమవారం న్యూయార్క్‌లోని మన్‌హటన్ ఫెడరల్ కోర్టులో ప్రవేశపెట్టింది. డ్రగ్ ట్రాఫికింగ్, అక్రమ ఆయుధాల కలిగి ఉన్నారన్న ఆరోపణలపై సాగిన విచారణలో తాము పూర్తిగా నిర్దోషులమని మదురో దంపతులు కోర్టులో స్పష్టం చేశారు. ఈ కేసు ఇప్పటికే అమెరికాఉవెనెజువెలా సంబంధాలను మరింత ఉద్రిక్తంగా మార్చగా, తాజాగా స్విట్జర్లాండ్ తీసుకున్న కీలక నిర్ణయం మరో పెద్ద షాక్‌గా మారింది. అమెరికా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, మదురో దంపతులను బ్రూక్లిన్ జైలు నుంచి సోమవారం ఉదయం మన్‌హటన్ ఫెడరల్ కోర్టుకు తరలించారు. ఉదయం 7 గంటల 15 నిమిషాల సమయంలో వారిని తొలుత జైలు నుంచి సమీపంలోని క్రీడా మైదానంలో ఉన్న హెలికాప్టర్ వద్దకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి హెలికాప్టర్ న్యూయార్క్ హార్బర్ మీదుగా మన్‌హటన్ హెలిప్యాడ్‌కు చేరుకుంది. అనంతరం సాయుధ వాహనంలో మదురో దంపతులను కోర్టు ప్రాంగణానికి తరలించారు. నీలం రంగు జైలు దుస్తుల్లో వారు కోర్టులోకి ప్రవేశించడంతో ఈ దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా మీడియా దృష్టిని ఆకర్షించాయి. వాస్తవానికి మదురో దంపతుల విచారణ మధ్యాహ్నం ప్రారంభమైంది. అంతకుముందు సుదీర్ఘ న్యాయ ప్రక్రియ సాగింది. విచారణ సమయంలో నికొలస్ మదురో తనను అక్రమంగా బంధించి అమెరికాకు తీసుకొచ్చారని వాదించేందుకు ప్రయత్నించారు. అయితే న్యాయమూర్తి వెంటనే జోక్యం చేసుకుని, కేసులో ఉన్న ఆరోపణలకే పరిమితమైన వాదనలు వినిపించాలని సూచించారు. కోర్టు ఆదేశాలతో మదురో తన వాదనను మార్చుకొని, ఆరోపణలను ఖండించడంపైనే దృష్టి పెట్టారు. "నేను నిర్దోషిని. నేను ఎలాంటి తప్పు చేయలేదు. నేను గౌరవప్రదమైన వ్యక్తిని, నా దేశానికి అధ్యక్షుడిని" అని మదురో కోర్టులో స్పష్టం చేశారు. డ్రగ్స్ రవాణాతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన న్యాయమూర్తి ఎదుట స్పష్టంగా చెప్పారు. ఇదే తరహాలో ఆయన భార్య సిలియా మదురో కూడా తాను నిర్దోషినని, ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. మదురో దంపతులు స్పానిష్‌లో వాదనలు వినిపించగా, కోర్టులోని అధికారిక ట్రాన్స్‌లేటర్ వాటిని ఆంగ్లంలోకి అనువదించారు. అయితే మదురో తరఫు న్యాయవాదులు మాత్రం, ఆయన ఒక సార్వభౌమ దేశానికి అధ్యక్షుడు కావడంతో అరెస్టు నుంచి రక్షణ (ఇమ్యూనిటీ) వర్తించాల్సి ఉందని వాదిస్తున్నారు. ఈ అంశాన్ని కోర్టులో విస్తృతంగా లేవనెత్తనున్నట్లు వారు తెలిపారు. మరోవైపు, విచారణ సమయంలో కోర్టు సమీపంలో కొంతమంది అమెరికా వ్యతిరేక కార్యకర్తలు ఆందోళనకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఇదిలా ఉండగా, మదురోకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్విట్జర్లాండ్ ప్రభుత్వం సోమవారం కీలక నిర్ణయం తీసుకుని, మదురోకు మరియు ఆయనకు సన్నిహితులకు సంబంధించిన స్విస్ ఆధారిత ఆస్తులన్నింటినీ తక్షణమే ఫ్రీజ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని స్విస్ ఫెడరల్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఎక్స్ (శ) వేదికగా అధికారిక ప్రకటన విడుదల చేసింది. మదురోకు లేదా ఆయనతో సంబంధం ఉన్న వ్యక్తులకు స్విట్జర్లాండ్‌లో ఉన్న బ్యాంకు ఖాతాలు, ఆస్తులు అన్నింటినీ నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ఈ నిర్ణయాన్ని మరింత వివరంగా తెలియజేస్తూ స్విస్ ప్రభుత్వం ఒక అధికారిక ప్రెస్ రిలీజ్‌ను కూడా విడుదల చేసింది. జనవరి 5, 2026 (స్థానిక కాలమానం ప్రకారం)న స్విస్ ఫెడరల్ కౌన్సిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొంది. మదురోతో పాటు ఆయనకు సన్నిహితంగా ఉన్న వ్యక్తులు స్విట్జర్లాండ్‌లో కలిగి ఉన్న ఆస్తులు దేశం వెలుపలికి తరలిపోకుండా నిరోధించడమే ఈ చర్య యొక్క ప్రధాన ఉద్దేశమని తెలిపింది. భవిష్యత్తులో న్యాయ ప్రక్రియల ద్వారా ఈ ఆస్తులు అక్రమంగా సంపాదించబడ్డవని తేలితే, వాటిని వెనెజువెలా ప్రజల సంక్షేమానికి ఉపయోగించేలా చర్యలు తీసుకుంటామని కూడా వెల్లడించింది. అయితే ఈ ఆస్తుల ఫ్రీజ్ నిర్ణయం ప్రస్తుత వెనెజువెలా ప్రభుత్వ సభ్యులకు వర్తించదని స్విస్ ప్రభుత్వం స్పష్టం చేసింది. 2018 నుంచే వెనెజువెలాపై అమల్లో ఉన్న ఆంక్షలకు ఇది అదనమని పేర్కొంది.

# రైతుల సమక్షంలోనే సర్వే జరగాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... రీసర్వేలో లోపాలు, రైతులెదుర్కొంటున్న సమస్యలు, పాస్ పుస్తకాల ముద్రణలో నెలకొన్న అంశాలపై ఆయన అసంతృప్తి, అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. అద్భుతంగా చేస్తున్నాం' అని చెబుతున్నా మౌలిక అంశాల్లో సమస్యలెందుకొస్తున్నాయని ప్రశ్నించారు. రీ సర్వేలో లోపాలు, పాస్ పుస్తకాల్లో తప్పులపై రైతుల్లో నెలకొన్న సందేహాలు, సమస్యలకు రెవెన్యూశాఖ కార్యాచరణతో కూడిన స్పష్టత ఇవ్వాలని సీఎం ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కురుకూరు, తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం చివ్వరంలో జరిగిన రీసర్వేలో వచ్చిన తప్పులు, రైతుల ఆందోళనలను వివరిస్తూ 'మళ్లీ అవే తప్పులు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' వార్తను ప్రచురించింది. పాస్ పుస్తకాల్లోని తప్పులు, సీఎం సొంత జిల్లాల్లోనే రైతులు ఎదుర్కొంటున్న చిక్కులపై 'పాస్‌కాని పుస్తకాలు' శీర్షికతో మరో వార్తను ప్రచురించింది. రైతుల్లో నెలకొన్న ఆందోళనలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చింది. మంగళవారం నిర్వహించిన సమీక్షలో చంద్రబాబు ఈ అంశాలపైనే దృష్టి సారించారు. "మీరు చెబుతున్న దాని ప్రకారం, మీ నివేదికల ప్రకారం... అంతా పక్కాగా రైతుల సమక్షంలోనే రీసర్వే జరుగుతుంటే తప్పులు ఎందుకు వస్తున్నాయి? రైతులకు నోటీసులు ఇచ్చే సర్వే చేస్తున్నారా? సర్వేలో రైతులను భాగస్వాములను చేస్తున్నారా?" అని సీఎం ప్రశ్నించారు. సర్వే సరిహద్దుల చట్టం ప్రకారం వ్యవహరిస్తున్నామని, రైతుల సమక్షంలోనే కొలతలు వేస్తున్నామని అధికారులు నివేదించారు. అదే నిజమైతే రైతులు ఎందుకు ఆందోళనగా ఉన్నారని సీఎం ప్రశ్నించారు. "క్షేత్రస్థాయి తనిఖీలు చేశారా? రైతులతో మాట్లాడుతున్నారా?" అని ఆరా తీసినట్లు సమాచారం. సర్వే ముగిసిన తర్వాత రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించాలని ఆదేశించారు. రైతుల విన్నపాలు కచ్చితంగా పరిశీలన చేయాలని... కోర్టు కేసులు, కుటుంబ తగాదాలున్నవి మినహా చట్ట పరిధిలో ఉన్న ప్రతి సమస్యనూ పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాలకు వెళ్లి స్వీయపరిశీలన చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు ఈ అంశంపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లి పర్యవేక్షణ చేయాలన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు పంపిణీ చేయడానికి కొత్తగా రాజముద్రతో రూపొందించిన పట్టాదారు పాస్‌పుస్తకాల్లో తప్పులు ఎందుకు వచ్చాయని సీఎం ప్రశ్నించారు. "ఈ తప్పులకు కారణాలు ఏమిటి? రైతుల పేర్లు, ఫొటోలు, ఇతర వివరాలు ఎందుకు తప్పుగా వచ్చాయి? ముద్రణకు ముందే రైతుల డేటాను పునఃపరిశీలించలేదా? గ్రామ సభలు నిర్వహించలేదా?" అని సీఎం ప్రశ్నించారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ జోక్యం చేసుకొని, గత జూన్ డేటా ఆధారంగా పాసుపుస్తకాల ముద్రణ జరిగిందని వివరించారు. వీటిని గత ఆగస్టులోనే ఇద్దామనుకున్నామని, కానీ, జాప్యంవల్ల ఈ సమస్యలు వచ్చాయని వివరించినట్లు తెలిసింది. ఈ నేప?థ్యంలో రెవెన్యూ రికార్డులను తాజాపరిచిన తర్వాతే కొత్త పాస్‌పుస్తకాలు అందించాలని సీఎం ఆదేశించారు. "ప్రభుత్వం ఇచ్చే పాస్‌పుస్తకాల ద్వారా రైతుల్లో నమ్మకం, భరోసా పెరగాలి. భూ రికార్డుల్లో గతంలో జరిగిన తప్పులను సరిదిద్ది ఇవ్వాలి. కొత్త పాస్‌పుస్తకాలు ముద్రించే ముందుగానే గ్రామసభల్లో ఆయా రైతుల నుంచి నిర్ధారణ చేసుకోవాలి. ఆ తర్వాతే ముద్రించాలి. రికార్డులను తారుమారు చేయడానికి ఆస్కారం లేకుండా తీర్చిదిద్దాం. ఎవరైనా ట్యాంపర్ చేయాలని ప్రయత్నించినా దొరికిపోతారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుందో రైతులకు వివరంగా చెప్పాలి. రికార్డుల్లో చేసే మార్పులకు రైతులకు ముందుగా సమాచారం ఇవ్వాలి. నోటీసులు ఇవ్వాలి" అని సీఎం ఆదేశించారు. రైతులు, భూ యజమానుల సమస్యల పరిష్కారంలో జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు. "ఇది రైతు సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమిచ్చే ప్రభుత్వం. రీ సర్వే, పాసుపుస్తకాల జారీలో రైతుల సంతృప్తిస్థాయి ఎంత ఎక్కువగా ఉంటుందన్నదే కీలకం. దానికి అనుగుణంగానే మీరూ పని చేయాలి" అని తేల్చి చెప్పారు.

# ఏ విచారణకైనా రెడీ

హైదరాబాద్: 2014 నుంచి, ఇటీవల తమ ప్రభుత్వం తెచ్చిన హిల్ట్‌పీ తో పాటు ఇప్పటివరకు జరిగిన పారిశ్రామికవాడల్లోని భూముల వినియోగ మార్పిడిపై ఏ విచారణను ఆదేశించడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క స్పష్టం చేశారు. ప్రతిపక్షలు అడ్డగోలుగా చేస్తున్న ఆరోపణలకు కట్టుబడి ఉంటే.. ఆ మేరకు లేఖ రాసిన మరుక్షణం ఏ విచారణ సంస్థతో కావాలంటే ఆ సంస్థతో విచారణ చేయించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మంగళవారం శాసనసభలో హైదరాబాద్ పారిశ్రామిక భూముల మార్పిడి (హిల్ట్) విధానం (పీ), తెలంగాణ రైజింగ్ఉ2047పై లఘు చర్చ సందర్భంగా పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలకు భట్టి జవాబిచ్చారు. హిల్ట్ పీతో రూ.10,776 కోట్ల ఆదాయం: 'ప్రతిపక్షం కడుపులో విషం పెట్టుకుని రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధిని పట్టించుకోకుండా తమ రాజకీయం కోసం రాజకీయాలు చేయడాన్ని మానుకోవాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం లీజు భూములను ఫ్రీహోల్డ్ చేసింది. తమకు కావాల్సిన వాళ్లకు పారిశ్రామిక భూములను వినియోగ మార్పిడి చేసింది. సిరీస్, గల్ఫ్ ఆయిల్ పరిశ్రమలకు భూ వినియోగ మార్పిడి చేసిన అంశాన్ని హిల్ట్ పాలసీతో పోల్చినప్పుడు రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ.4,076 కోట్ల నష్టం వాటిల్లింది. హిల్ట్ పీ కింద కాంగ్రెస్ ప్రభుత్వం.. 80 అడుగుల లోపు రహదారి ఉన్న భూములకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ (ఎస్ఆర్వో) ధరలో 30 శాతం, 80 అడుగుల కంటే ఎక్కువ వెడల్పుతో రహదారి ఉన్నచోట ఎస్ఆర్వో ధరలో 50 శాతం చెల్లించేలా నిర్ణయం తీసుకుంది. ఈ భూములపై ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదు. కేవలం భూ వినియోగ మార్పిడి చేస్తున్నందుకు ఈ ఫీజులు వసూలు చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న భూ వినియోగ మార్పిడి ధరల ప్రకారం అయితే కేవలం రూ.574 కోట్ల ఆదాయం మాత్రమే రాష్ట్రానికి లభిస్తుంది. అదే హిల్ట్ పీ కింద దాదాపు 4,780 ఎకరాల భూములకు భూ వినియోగ మార్పిడికి అవకాశం కల్పించడం ద్వారా దాదాపు రూ.10,776 కోట్ల ఆదాయం లభిస్తుంది..' అని డిప్యూటీ సీఎం తెలిపారు. 'హిల్ట్ పాలసీ రాగానే ప్రధాన ప్రతిపక్షనికి చెందిన ఓ నాయకుడు ప్రెస్‌మీట్ పెట్టి రాష్ట్రంలోని భూములన్నింటినీ అమ్మేస్తూ రూ.5 లక్షల కోట్ల స్కామ్‌కు తెరలేపారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలు విస్మరించి, బట్ట కాల్చి మీద వేసి తుడుచుకోమంటున్నారు. వారు రాష్ట్ర ప్రజా ప్రయోజనాల కంటే.. సొంత ప్రయోజనాల కోసం ఎక్కువగా పాకులాడుతున్నారు. హిల్ట్ పీ వల్ల రాష్ట్రానికి ఆదాయం లభిస్తుంటే.. గతంలో వారు చేసిన నిర్ణయాలతో భారీ నష్టం జరిగింది. గత ప్రభుత్వం అనుసరించి విధానాలతో పోలిస్తే హిల్ట్ పీ అత్యుత్తమమైనది. పారదర్శకమైనది. ఆదాయం సమకూరుతుంది. వారు ఆజామాబాద్, బాలానగర్, హఫీజ్‌పేట పారిశ్రామిక వాడల్లో ప్రభుత్వ భూములు లీజులో ఉంటే...వాటిని వేలానికి పెట్టకుండా ఇష్టానుసారం ఇచ్చేశారు.

## తమిళనాడులో ఎన్డీఏకు సంక్లిష్ట పరిస్థితి

తమిళనాడులో బీజేపీఉఅన్నాడీఎంకే కూటమి భవితవ్యం అనిశ్చితిలో పడుతున్నట్లు రాజకీయ పరిణామాలు సూచిస్తున్నాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం విశ్వాసం వ్యక్తం చేయగా, మరుసటిరోజే అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి కే. పళనిస్వామి తమ పార్టీ సొంత మెజార్టీతోనే అధికారంలోకి వస్తుందని ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ భిన్న ప్రకటనలు ఎన్డీయేలో అంతర్గత భేదాభిప్రాయాలు పెరిగినట్లుగా కనిపిస్తున్నాయి. పార్టీ కార్యక్రమాల నిమిత్తం అమిత్ షా రెండు రోజుల పర్యటనకు తమిళనాడుకు వచ్చారు. ఈ సందర్భంగా పుదుకొట్టాయిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ నేతృత్వంలో 'తమిళగమ్ తలై నిమ్ర తమిళియన్ పయనం' యాత్రను ప్రారంభించారు. ఈ సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, అన్నాడీఎంకేతో సీట్ల సర్దుబాటుపై చర్చలు కొనసాగుతున్నాయని, ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. అయితే, రాష్ట్రానికి వచ్చిన అమిత్ షాను పళనిస్వామి కలుసుకోకపోవడం, ముందుగా నిర్ణయించుకున్న అపాయింట్‌మెంట్లు ఉన్నాయంటూ దూరంగా ఉండటం రాజకీయంగా కీలక సంకేతంగా భావిస్తున్నారు. ఇప్పటికే ఎన్డీయే విస్తరణ ప్రయత్నాలు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. గతంలో కూటమిలో భాగస్వాములైన డాక్టర్ ఎస్. రాందాస్ నేతృత్వంలోని పీఎంకే, దివంగత విజయకాంత్ పార్టీ డీఎండీకే ఇప్పటికీ తమ నిర్ణయాన్ని స్పష్టంగా ప్రకటించలేదు. ఈ పరిస్థితుల్లో అమిత్ షాఉపళనిస్వామి మధ్య ప్రత్యక్ష భేటీ జరగకపోవడం ఎన్డీయేలో లుకలుకలను బయటపెట్టినట్టుగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, పళనిస్వామి సన్నిహితుడు, అన్నాడీఎంకేలో కీలక నేతగా భావించే మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి మాత్రం తిరుచిరాపల్లిలో అమిత్ షాను రెండు సార్లు కలుసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, రాబోయే ఎన్నికల్లో డీఎంకేను ఓడించాల్సిన వ్యూహాలపై చర్చ జరిగిందని పార్టీ వర్గాలు చెబుతున్నప్పటికీ, ప్రధానంగా సీట్ల సర్దుబాటు అంశంపైనే చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వేలుమణిఉఅమిత్ షా భేటీని ఎన్డీయే భవిష్యత్తుకు కీలకంగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో కనీసం 170 స్థానాల్లో పోటీ చేయాలని అన్నాడీఎంకే భావిస్తోంది. అలా చేస్తే సొంత మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చన్నది పళనిస్వామి వాదన. ఇదే విషయాన్ని గతంలో కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు కూడా ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. అన్నాడీఎంకే 170 సీట్లలో పోటీ చేస్తే, మిగిలిన 64 సీట్లను మాత్రమే ఎన్డీయే భాగస్వాములకు కేటాయించేందుకు సిద్ధమని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. అధికారంలో భాగస్వామ్యం ఇవ్వాలన్న బీజేపీ డిమాండ్‌కు పళనిస్వామి అంగీకరించే ప్రసక్తే లేదని అన్నాడీఎంకే మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించినట్లు 'ది వీక్' పేర్కొంది. మరోవైపు, బీజేపీ వ్యూహం తిరుగుబాటు నేతలు ఓ. పన్నీర్‌సెల్వం, టీటీవీ దినకరన్‌లను సభకు తీసుకురావడమేనన్న ప్రచారం కూడా ఉంది. అయితే, ఈ ఇద్దరూ పళనిస్వామి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే ఎన్డీయే నుంచి బయటకు వచ్చారు.







కచార్ పోలీసులు సునబారిఘాట్ బైపాస్ వద్ద రెండు వాహనాలను అడ్డగించి, 2 కోట్ల విలువైన 406 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుని, ఐదుగురు మాదకద్రవ్యాల స్మగ్లర్లను అరెస్టు చేశారు పోలీసులు. అస్సాంలోని మాదకద్రవ్యాల మార్గాలు ఎక్కువ దూరం సాగవు, అవి ఇక్కడే ముగుస్తాయన్నారు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వశర్మ. -నవతరం, అస్సాం



# ప్రజాసంఘాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

కుత్బుల్లాపూర్, నవతరం: నియోజకవర్గ పరిధిలోని ఓం మణికంఠ నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు సూరారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సంఘం అధ్యక్షులు గడేల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షమం, నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణ అంశంపై విస్తృతంగా చర్చించామని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం ద్వారా సంఘ సభ్యులకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు శాశ్వత వేదిక లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం, పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ... ప్రజా సంఘాల అభివృద్ధికి బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ సహకరిస్తుందని, కమ్యూనిటీ హాల్ నిర్మాణ అంశాన్ని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీస్కెళ్లి సాధ్యమైన అన్ని విధాలుగా సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సంఘం చీఫ్ సెక్రటరీ వి.ఎస్.ఆర్. వెంకట్ నాయి, మాజీ అధ్యక్షులు ఏ. రేనయ్య నాయి, మాజీ ప్రధాన కార్యదర్శి కే. పరమేష్ నాయి, చైర్మన్ గడ్డం రవీందర్ నాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికృష్ణ నాయి, ఉపాధ్యక్షులు నరేష్ నాయి, సలహాదారులు బిక్షపతి నాయి, కోశాధికారి సతీష్ నాయి, యూత్ ప్రెసిడెంట్ రమేష్ నాయి, షాపూర్ నగర్ అధ్యక్షులు బండారి తిరుపతిదాసు నాయి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ నాయి తో పాటు ఇతర సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



# ఓం నారాయణ ఆక్రమించుకున్న ప్రభుత్వభూమిని స్వాధీనం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఎల్ హెచ్ పి ఎస్ నిరసన**

**ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గూగులోతు భీమా నాయక్.**

**ముఖ్య అతిథిగా డాక్టర్ వివేక్ హాజరు కాగా, పోలీసుల అనుమతి నిరాకరణ తో కలెక్టర్ ఆఫీసు ఎదుట నిరసన**

**ప్రభుత్వ జీతం తోసుకొని ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు వత్తాసు పలకడం ఏంటి.?**

**అతి త్వరలో హై కోర్ట్ ద్వారా ఆర్డర్ తీసుకొస్తామని స్పష్టం చేశారు**

మహబూబాబాద్,జనవరి 6,నవతరం: ఓం నారాయణ ఆక్రమించుకున్న 107 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ లంబాడీ హ క్కుల పోరాట సంఘం ( ఎల్ హెచ్ పి ఎస్ ) నాయకులు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యా లయంలో వినతి పత్రం అందజేశారు. ముందుగా నిర్ణయించిన వ్యవసాయ మార్కెట్ ఎదుట దీక్షకు సిద్ధమవ్వగా, పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో నాయకులు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించి, అనంతరం కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు గూగులోతు భీమా నాయక్ మాట్లాడుతూ, గత ఏడాది కాలంగా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా, వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఎల్ హెచ్ పి ఎస్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు,ప్రభుత్వ భూములను కాపాడాల్సిన యంత్రాంగం, కబ్జాదారులకు అండగా నిలబడటం సమాజానికి ఎలాంటి సందేశాన్ని ఇస్తుందని వారు ప్రశ్నిం చారు, ఆక్రమణదారుడు ఓం నారాయణ అధికార కాంగ్రెస్ పార్టీలో ఉన్నందుకే అధికారులు భూమిని స్వాధీనం చేసుకోవడం లేదా? అని వారు నిలదీశారు,ప్రభుత్వం స్పందించి ఆ భూమిని స్వాధీనం చేసుకునే వరకు తమ పోరాటం ఆగే ప్రసక్తి లేదని నేతలు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు బాలు నాయక్,లావుడియా సీతారాం నాయక్,చంద్రు నాయక్,శాంతి కుమార్, సాయి కుమార్,సూర్య ప్రకాశ్,శివ వర్మ,అజయ్,సంతోష్,మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.










ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమైన జ్యోతి యర్రాజీని కలవడం ఆనందంగా ఉంది, 100 మీటర్ల హర్డిల్స్‌లో కొత్త మీట్ రికార్డుతో ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలుచుకున్నందుకు ఆమెను అభినందిస్తున్నాను. ఆమె ధైర్యం మరియు దృఢ సంకల్పం దేశానికి స్ఫూర్తినిస్తాయి. ఆసియా అండ్ కామన్వెల్త్ క్రీడల కోసం ఆమె సన్నాహాలకు మేము 30.35 లక్షల రూపాయలు మద్దతును అందించాము. ఒలింపిక్ కీర్తి మార్గంలో మేము ఆమెకు అండగా నిలుస్తామన్నారు తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్.

- నవతరం, ఆంధ్రప్రదేశ్


## ది హోమ్ ఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్

Plot No. 174 to 176, phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051. 9391221697

**చదువుకునే పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం**

బి. యన్. రెడ్డి నగర్ ఫేజ్ - 1 ఐకాం ఎదురుగా చర్లపల్లిలో 1996 సం॥లో "ద హోంఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్" అనే విద్యార్థుల వసతి గృహము స్థాపించబడినది. ఈ సంస్థ నగరంలోని దాతల సహకారంతో నడుపబడుచున్నది. ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం ఏమంటే బాగా చదువగలిగే ఉండి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మానేసేవారిని కూలీలుగా కార్మికులుగా మారకుండా సమాజానికి పనికివచ్చే మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని. గ్రామీణ పేద విద్యార్థులకు హైదరాబాద్ నగరంలో ఉండి చదువగలిగే ఆర్థిక స్తోమత లేనివారికి వసతి, బోజనం, పుస్తకాలు, నోట్‌పుస్తకాలు. బస్‌పాస్ మరియు పరీక్షఫీజులు కూడా చెల్లించి వారి భావి జీవితము అత్యున్న తంగా ఉండేలా తీర్చిదిద్దాలని మా ఆశయం.

ఇందులో అడ్మిషన్ పొందగలిగే విద్యార్థులకు కులము. మతము పట్టింపులు ఏమీ ఉండవు. ఇందులో చదువుకోదలచిన విద్యార్థులకు నగరంలో ఏదైనా కళాశాలలో అడ్మిషన్ పొంది ఉండవలెను మంచి మార్కులు వచ్చిన అనాథ విద్యార్థులకు తల్లి లేదా తండ్రి లేనివారికి గ్రామీణ పేద విద్యార్థులకు మేనేజ్‌మెట్ తరవున కళాశాల యాజమాన్యంతో సంప్రదించి వీలైతే ఏదైనా మంచి కళాశాలలో ఫ్రీ అడ్మిషన్ ఇప్పించుటకు మా వంతు కృషి చేయగలము.

ఈ సంస్థ స్థాపించిన మొదటి సంవత్సరం నుండి ఇప్పటి వరకు ఇందులో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ అందరి మన్ననల్ని పొందుచున్నారు సుమారు 400 మంది గత 29 సం॥లలో ఈ హోమ్‌లో చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడినారు

ఇందులో అడ్మిషన్ కోరకై విద్యార్థులు 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి (ఇంటర్ 1. 2. ఏదైనా డిగ్రీ ఫస్ట్ ఇయర్‌వారు) దరఖాస్తుకు అర్హులు గ్రామీణ అనాధ విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది తల్లి లేదా తండ్రి లేని నిరుపేద విద్యార్థులు. పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చును. విద్యార్థులు తమ మార్కులకు సంబందించిన మెమో. అదే విధంగా బోనోఫైడ్ సర్టిఫికేట్స్ (ప్రస్తుతం చదువుతున్న కళాశాలకు సంబంధించినది). తల్లిదండ్రులు లేనిచో మరణ ధృవీకరణ పత్రము ఆదాయం సర్టిఫికేట్ (ఎం.ఆర్.ఓ. గారిచే ధృవీకరించబడినది అయి ఉండాలి). అన్ని సర్టిఫికేట్స్ యొక్కజిరాక్స్ కాపీలను మరియు రెండు పాస్‌పోర్టుసైజు ఫోటోలను సొంత చిరునామా కలిగిన స్టాంపులు అంటించి కవరును పోస్టు ద్వారాగాని. ఇమెయిల్ ద్వారాగాని. వాట్సప్ (9391221697) ద్వారాగాని. స్వయంగా గాని పైన ఉన్న చిరునామాకు వెంటనే పంపించగలరు. పూర్తి వివరాలకుపైన నెంబర్లకు సంప్రదించగలరు.

అడ్మిషన్లు ప్రారంభమైనవి

అడ్రస్ కొరకు SCAN చేయండి

మనవి : కళాశాల ప్రిన్సిపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు. ఉపాధ్యాయులు మరియు విద్యాశాఖ అధికారులు చదువుకునే పదవతరగతిలో ఉత్తీర్ణులైన పేద విద్యార్థులను ప్రోత్సహించి మా హోం కు పంపించగలరు.

గమనిక: ఈ వసతి కేవలం బాలురుకు మాత్రమే

Bittu Digitals Aler - 8919441120



## ది హోమ్ ఫర్ ఆర్ఫన్ స్టూడెంట్స్ | THE HOME FOR ORPHAN STUDENTS

Plot No. 174 to 176, Phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051.

Plot No. 174 to 176, Phase -1 B.N. Reddy Nagar,, OPP. ICOMM, Cherlapally, Hyderabad - 500 051.

పదవ తరగతి పై బడిన చదువుతున్న ఇంటర్మీడియట్/ఐ.టి.ఐ/ పాలిటిక్నిక్/ డిగ్రీ/ ఇంజనీరింగ్/ పారా మెడికల్ కోర్సులు/ పి.జి కోర్సులు.



A golden Opportunity for Orphaned and underprivileged students studying Intermediate, ITI, Polytechnic, Degree, Engineering, Paramedical, or PG Courses after completing 10th class.

హైదరాబాద్‌లోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న అనాథ/ పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం.

Students Studying in Government or Private Colleges in Hyderabad are Eligible.

మానవత్వం సహృదయం గల దాతల హార్థిక, ఆర్థిక సహాయ సహకారాలతో నిర్వహించబడుచున్న సంస్థ. గత 30 సం॥లలో సుమారు 400 మంది విద్యార్థులు ఈ హోమ్‌లో చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడినారు.

With the support of kind-hearted and humanitarian donors, an organization is being run since last 30years about 400plus students studied and well setteled down happily in life.

బాలురకు మాత్రమే

ఉచిత వసతి, భోజనం, బస్‌పాస్, సౌకర్యాలతో

SCAN HERE For ADDRESS

ONLY FOR BOYS

Free Accommodation
Free Meals
Free Bus Pass
Other Essential Facilities.

అడ్మిషన్ల కొరకు పైన పేర్కొన్న అడ్రస్ లో సంప్రదించగలరు. | For Addmissions Please Contact the Address Mentioned Above

Cell: 9391221697

# చిరస్మరణీయులు.. భారత్‌పై దండెత్తవద్దన్న అరిస్టాటిల్

భారత్ పై దండెత్త వద్దని తన ప్రియ శిష్యుడు అలెగ్జాండర్ కు సలహా ఇచ్చిన గురువు అరిస్టాటిల్.కాని అతను అదే చేసి ఫలితం అనుభవించిన విషయం విదితమే.

మానవుడు సంఘజీవి అని మొట్టమొదటి నిర్వచించింది గ్రీక్ తత్వవేత్త అరిస్టాటిల్. అరిస్టాటిల్ (క్రీ.పూ 384-322)ప్రాచీన గ్రీకు తత్వవేత్త. బహుముఖ ప్రజ్ఞాశాలి.పాశ్చాత్య ఆలోచనా విధానానికి పునాది లాంటివాడు. ప్లేటో ప్రియ శిష్యుడు.అలెగ్జాండర్ గురువు. ప్లేటో ఆదర్శరాజ్యానికి ఆయన మరింత మెరుగైన వివరణ, పరిష్కారాలు సూచించారు.అలాగే ఆయన తత్వసిద్ధాంతం మధ్యయుగ ముస్లిం,క్రైస్తవ గురువులను ప్రభావితం చేసిందని చారిత్రిక ఆధారాలున్నాయి. ఆయన స్పృశించని శాస్త్రం లేదు. ప్రధానంగా తర్కం, నీతి శాస్త్రం,రాజకీయ శాస్త్రం, జీవశాస్త్రం,భౌతిక శాస్త్రం లలో చేసిన కృషి అమోఘం. జీవ శాస్త్రానికి పితామహుడిగా ప్రసిద్ధి. ఆయన గ్రంథల ప్రభావం దాదాపు 2000 సంవత్సరాలు ఉందంటే ఆశ్చర్యమే.నేటికీ ఆయన రచనలు ప్రామాణికంగా ఉన్నాయి. పరిశోధనలు జరుగుతున్నాయి.

ఃవిద్య చేదు,కానీ దాని పండు తీపిః అన్నాడు.ధైర్యం మానవ లక్షణం.ఆనందం అనేది జీవితం లక్ష్యమన్నారు.తర్కం గురించి తొలుత నిర్వచించినది అరిస్టాటిల్.ఆయన ప్లేటో అకాడమీలో చదువుకున్నారు. క్రీ.పూ.336లో అలెగ్జాండర్ తండ్రి హత్య తరువాత మాసిడోనియా నుంచి ఏథెన్స్ చేరుకున్నాడు.ప్లేటో అకాడమీకి పోటీగా ఏథెన్స్‌లో లైసియం పాఠశాలను స్థాపించారు.అక్కడ తత్వశాస్త్రం బోధించిన విధానం ఃఅరిస్టోటేలియన్ః సాంప్రదాయం గా పేరుగాంచింది. అదే ఆధునిక శాస్త్రీయ దృక్పథనికి, అభివృద్ధికి పునాది అయింది.

ఆయన జీవితం గూర్చి చరిత్రలో పూర్తి వివరాలు లేవు.ఆయన క్రీస్తుపూర్వం ఉత్తరగ్రీసు స్టాగిరా నగరంలో జన్మించాడు.తండ్రి చిన్నతనంలోనే చనిపోయారు.సంరక్షకుడి రక్షణలో పెరిగాడు.18 ఏళ్ల వయస్సులో ప్లేటో అకాడమీ లో చేరాడు.37 సంవత్సరాల వరకూ అక్కడే ఉన్నాడు.ప్లేటోమరణించిన అనంతరం మాసిడోనియా లో ఫిలిఫ్-2. కుమారుడు అలెగ్జాండర్ కు గురువుగా విద్యను బోధించాడు.తన లైసియంలో గ్రంథలయం స్థాపించాడు.అదే ఆయన రచనలకు దోహదపడింది.ఆయన రచనలు వేయ్యి వరకూ ఉంటాయని ప్రతీతి.ప్రస్తుతం ఆయన రాసిన రచనల్లో మూడోవంతు మాత్రమే లభ్యమవుతున్నాయి.

అరిస్టాటిల్ విప్లవాన్ని కూడా నిర్వచించారు.కొత్తరాజకీయవ్యవస్థ విప్లవం ద్వారా ఏర్పడుతుందన్నారు. రాజ్యాంగం మారడాన్ని పూర్తివిప్లవమన్నాడు. పాలకులు మారినప్పుడు రాజ్యాంగం యథతథంగా ఉండి, కొత్త విధానాలు అమలులోకి వస్తే దాన్ని పాక్షక విప్లవంగా నిర్వచించాడు. అలాగే విప్లవానికి మూల కారణం అసమానత,అన్యాయం,గౌరవంకోసమన్నాడు.దానికి పరిష్కారం చట్టాలను గౌరవించడం,మధ్యతరగతి వర్గాన్ని బలోపేతంచేయడం,విద్య,న్యాయం అధికారాల సమతుల్యం,ప్రజా సమస్యల పరిష్కారంగా సూచించారు.

విప్లవానికి మూలం అలిగార్కీ అంటే కొద్దిమంది పాలనగా పేర్కొంటూ ఆ పాలనలో సామాన్య ప్రజల పట్ల అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు.అలాగే ప్రజాస్వామ్యంలో పేదలకు ధనికులపై ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు. ప్రభుత్వ అధికారులు ప్రజల సొమ్ము దోచుకోవడం. న్యాయం లోపించడం,రాజకీయ అవినీతి పెరగడం ప్రధానకారణాలుగా



పేర్కొన్నారు. ప్లేటో ఆదర్శరాజ్యంపై అరిస్టాటిల్ విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేసారు.మార్పు అనివార్యమని,అదే పురోగతికి మార్గమని సిద్ధాంతీకరించారు.ఆయనరాజకీయ విశ్లేషణలు,అధ్యయనం ఆచరణాత్మక రాజకీయాలకు దగ్గరగా ఉన్నాయి.మధ్యతరగతి వర్గం పెరగడం రాజకీయ సుస్థిరతకు దోహదపడుతుందన్నారు.అణచివేత దేనికీ పరిష్కారం కాదన్నారు. అరిస్టాటిల్ అభిప్రాయాలు మధ్యయుగ సాంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేసాయి. విజ్ఞానశాస్త్రాన్ని ప్రభావితం చేసాయి.ఆయన సిద్ధాంతాలు మధ్యయుగ జూడియో-ఇస్లామిక్ తత్వాన్ని, క్రైస్తవ వేదాంతాన్ని,ప్రారంభ చర్చి సాంప్రదాయాన్ని ప్రభావితం చేసాయి.అరిస్టాటిల్ ను మధ్యయుగ ముస్లిం పండితులు గురువుగా,థమస్ అక్వినాస్ వంటి ఆనాటి క్రైస్తవులు తత్వవేత్తగా గౌరవించారు.

నీవు సంపాదించిన దానికంటే తక్కువ ఖర్చు చేస్తే నిన్ను మించిన ఆర్ధిక వేత్త ఉండదని అర్ధిక సూత్రాన్ని ఆనాడే చెప్పాడు అరిస్టాటిల్.

అలాగే పురుషుడికి 35,మహిళకు 18 ఏళ్లు వివాహవయస్సుగా పేర్కొనడం గమనార్హం. సాధువు మెదడులో కూడా ఒక మూల మూర్ఖపులక్షణాలు ఉంటాయన్నారు.అలాగే విప్లవానికీ, మోసానికి ప్రధాన కారణం పేదరికమని తేల్చి చెప్పాడు.

ఆనందం అనేది మన పైనే ఆధార ఉంటుందని,స్థిరమైన సద్గుణ చర్యలు,స్వీయ అభివృద్ధి ద్వారా సాధించవచ్చని అరిస్టాటిల్ నమ్మాడు.జీవితాంతం ఆనందాన్ని సాధించడం అరిస్టాటిల్ ధృక్పథంగా చెప్పాడు.ఃహృదయానికి విద్య నేర్పకుండా మనసుకు విద్య నేర్పడం వ్యక్తిత్వం కాదఃన్నాడు. ఃమిమ్మల్ని మీరు తెలుసుకోవడమే జ్ఞానానికి నాందిః అన్నాడు.భయాలను అధిగమిస్తేనే మనిషి స్వేచ్ఛగా ఉంటాడన్నారు.స్నేహాన్ని అత్యున్నతంగా భావించాడు. ఃస్నేహితుల మధ్య రెండు శరీరాల్లో ఉండేది ఒకే ఆత్మగాః నిర్వచించారు.యవ్వనంలో అలవరుచుకున్న సద్గుణాలు జీవిత వ్యక్తిత్వానికి నిదర్శనమన్నాడు. ప్రకృతిపై అరిస్టాటిల్ కు అభిమానం.ప్రకృతి అద్భుతాలపై ఆయన భౌతికశాస్త్రం లో వివరంగా పేర్కొన్నారు.ఆదర్శ పురుషుడు ప్రమాదాలను గౌరవంగా భావిస్తాడని చెప్పాడు.మంచి అనుచరుడుగా ఉండలేనివాడు మంచినాయకుడు కాలేడన్నాడు.

అరిస్టాటిల్ మానవులను సామాజిక జీవులుగా చూసాడు.సమతుల్య జీవితానికి సమాజం అవసరమన్నారు.ఏకాంతంలో ఆనందించే వాడిని దేవుడు అనవచ్చన్నాడు.భూమి ఆవిర్భావం, పర్వతాలు ఏర్పడే విధానం వివరించారు. ఆయన రచనల్లో ప్రముఖమైనది ఆర్గనోస్ గ్రంథం. పాలితులు,పాలకులు మధ్య సహజమైన సమైక్యత ఉండాలన్నారు. పాలిటిక్స్ గ్రంథంలో రాజ్యం, రాజకీయ జీవితం గూర్చి చర్చించాడు.

వ్యక్తికిముందే రాజ్యం సహజసిద్ధంగా ఏర్పడిందన్నారు.ప్లేటో ఆదర్శ రాజ్యంలో పేర్కొన్నట్లు రాజ్యంలోని చట్టానికి సార్వభౌమాధికారం ఉంటుందిగాని

వ్యక్తికి కాదనే అంశాన్ని అరిస్టాటిల్ అంగీకరించాడు.ఆయన ప్రభుత్వాన్ని ఆరు రకాలుగా విభజించారు.రాజరికం,శ్రేష్టజనుల పాలన,పాలిటీ (అధిక జనుల), క్రూరజనుల పాలన,అల్ప జనుల పాలన, ప్రజాస్వామ్యం.మొదటి మూడు చట్టబద్ధమైనవి.చివరిమూడు వికృత రూపాల న్నాడు.ప్రజాస్వామ్యంలోఅందరికీ సమానత్వం ఉంటుందన్నాడు.రాజ్యాంగబద్ద ప్రజాస్వామ్యంలో అల్ప సంఖ్యాక జనులకు రక్షణ ఉంటుందన్నారు.

అరిస్టాటిల్ బరువైన వస్తువు తేలిక వస్తువు కంటే త్వరగా భూమిని చేరుతుందని చెప్పాడు.అది తప్పని గెలీలియో రుజువు చేసాడు.అలాగే అరిస్టాటిల్ విశ్వానికి భూమినే కేంద్రమని,చంద్రుడికి స్వయంప్రకాశ శక్తి ఉందన్నాడు.శూన్య ప్రదేశం సృష్టించడంతో అసాధ్యమన్నారు.వస్తువు కలవాలంటే శక్తి అవసరమని,సాధారణంగా వస్తువు స్థిరంగా ఉంటుందన్నాడు.ఆత్మకూ చావు ఉంటుందని నమ్మేవాడు.

అలెగ్జాండర్ మరణం తరువాత ఏథెన్స్ ప్రజలు స్వాతంత్ర్యం ప్రకటించుకుని అరిస్టాటిల్ ను దైవ ద్రోహిగా ప్రకటించడంతో తన తల్లి స్వస్థలమైన చాల్సిస్ పారిపోయాడు.అక్కడే ఏడాది జీవించ అనారోగ్యంతో క్రీ.పూ.322 లోకన్నుమూసారు.భారతదేశంపై దాడి చేయవద్దని అలెగ్జాండర్ కు సలహా ఇచ్చాడు.కానీ అలెగ్జాండర్ ఆయనను ఒప్పించి దాడికి బయలుదేరాడని చారిత్రిక ఆధారాలు ఉన్నాయి.ఏదిఏమైనా మధ్యయుగంలో పాశ్చాత్య సమాజంపై ఆయన తత్వసిద్ధాంతం సంచలనం సృష్టించింది.అలాగే ఆయన రచనలు ఆధునిక యుగం వరకూ ప్రభావితం చేస్తునే ఉండడం విశేషం.

**యం.వి.రామారావు, 8074129668**

**- నవతరం :విజయవాడ**

---



# విపత్తుల నిర్వహణకు హైడ్రా దిక్సూచి

## ముందస్తు చర్యలతో డిజాస్టర్ ప్రభావాన్ని తగ్గిస్తున్నాం

## ఎల్బీఎస్ఎన్ఏలో ప్రసంగించిన హైడ్రా కమిషనర్

## హైడ్రా సేవలపై ఆరా తీసిన సీనియర్ ఐఏఎస్ అధికారులు

## దేశవ్యాప్తంగా ఇలాంటి వ్యవస్థ ఉండాలంటూ కితాబు

హైదరాబాద్, నవతరం: ప్రపంచ జనాభా 823 కోట్లుంటే.. అందులో మన దేశ జనాభా 145 కోట్లు. ముంబయ్, దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ పట్టణాలలో పట్టణ జనాభా పెరుగుదల గణనీయంగా ఉంది. దేశంలో 2050 నాటికి నగర జనాభా 50 కోట్లకు చేరనుందని లెక్కలు చెబుతున్నాయి. 1975లో హైదరాబాద్ జనాభా 21 లక్షలుండంగా.. ప్రస్తుతం 1.3 కోట్లకు చేరింది. హైదరాబాద్‌లో జనాభా వృద్ధి రేటు 6.2 రెట్లుంది. నగర జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని అందరికీ మెరుగైన, పర్యావరణ హితమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం హైడ్రా ను తీసుకువచ్చింది అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. దేశంలోనే ఇలాంటి వ్యవస్థ ప్రప్రథమమని పేర్కొన్నారు. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న వేళ.. ప్రజలకు మెరుగైన సేవలు, పాలన అందించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో



చర్చించడానికి ఉత్తరాఖండ్, ముస్సోరీలోని లాల్‌బహద్దూర్ శాస్త్రి నేషనల్ అకాడమీలో మున్సిపల్ గవర్నెన్స్ ఫర్ అడ్మినిస్ట్రేటర్స్ పేరిట 5 రోజుల మేధోమథనానికి హైడ్రా కమిషనర్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్న సీనియర్ ఐఏఎస్ లు, ముఖ్య పట్టణాల మున్సిపల్ కమిషనర్లు, ఎన్‌డీఎంఏ, ఎస్‌డీఆర్ ఎఫ్ అధికారులు హాజరైన ఈ సదస్సులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం ప్రసంగించారు. హైడ్రా ఆవిష్కరణ, విధివిధానాలు, లక్ష్యాలు వివరించారు. తెలంగాణ ప్రభుత్వ సాహసోపేత నిర్ణయం హైడ్రా..హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకురావడం.. అధికారాలు కట్టపెట్టడం తెలంగాణ ప్రభుత్వ సాహసోపేత నిర్ణయంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలనుంచి ఆవిష్కృతమైన ఈ సంస్థ.. ప్రకృతి వైపరీత్యాల నిర్వహణలో కొత్తకోణాన్ని ఆవిష్కరించిందన్నారు. కాలుష్యం కారణంగా క్లౌడ్‌బరస్ట్‌లు సర్వసాధారణంగా మారిపోయిన వేళ.. వరదలకు ఆస్కారం ఉండే అంశాలపై హైడ్రా దృష్టి పెట్టింది. నగరాల్లో ఉండే చెరువులు, నాలాలను పునరుద్ధరించి.. ప్రకృతి చికిత్స హైడ్రా చేస్తోందన్నారు. చెరువులతో పాటు వాటిని అనుసంధానం చేసే నాలాలను పరిరక్షించడంతో పాటు పునరుద్ధరిస్తున్నామన్నారు. ఈ రెండు చర్యలతో హైదరాబాద్ నగరంలో చాలా వరకు వరద ముప్పును తగ్గించామన్నారు. హైడ్రాను తీసుకువచ్చిన ప్రభుత్వంపైన, హైడ్రా పైనా అనేక విమర్శలు చేసిన రాజకీయ పార్టీలు తర్వాత కొనియాడడం మొదలు పెట్టాయి. కబ్జాదారులు, ఆక్రమణదారులు హైడ్రాపై బురదజల్లే కార్యక్రమాలను చేపట్టినా.. ప్రజలు వాటిని తిప్పి కొట్టారు. హైడ్రాకు మద్దతుగా భారీ ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ ముందు చూపునకు జై కొట్టారు. హైడ్రా కార్యకలాపాలపై ఆసక్తి...పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హైడ్రా కార్యకలాపాలను కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరించినప్పుడు వివిధ స్థాయిల సీనియర్ అధికారులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. కొన్ని సార్లు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. హైడ్రా చర్యలవల్ల ప్రభుత్వం ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొందా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల స్పందన ఎలా ఉంది..? బడాబాబుల భూ కబ్జాలను తొలగించినప్పుడు ఉండే ఒత్తిళ్లపై ఆరాతీశారు. ఇలా అనేక సందేహాలను నివృత్తి చేసుకున్నారు. హైడ్రా సుమారు 1,313.19 ఎకరాల ఆక్రమిత భూములను (చెరువులు, పార్కులు, రోడ్లు, నాలాలు) స్వాధీనం చేసుకుంది. వీటి విలువ సుమారు రూ. 65, 650 కోట్లు ఉంటుందని అంచనా. మూసీ నది పరీవాహక ప్రాంతంలోని ఆక్రమణలను తొలగించి, నది సహజ ప్రవాహాన్ని పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దేశవ్యాప్తంగా హైడ్రా లాంటి వ్యవస్థ ఉండడం చాలా అవసరమని ఈ సదస్సుకు హాజరైన కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు భావించారు. దేశవ్యాప్తంగా ఇలాంటి వ్యవస్థ అన్ని పట్టణాలకు అవసరముందని పలువురు వ్యాఖ్యానించారు. సొంతింటి కల సాకారం చేసుకోవాలనుకునేవారు హైడ్రా చర్యలతో ధైర్యంగా పెట్టుబడులు పెడుతున్నారన్నారు.

---




# శ్రీ చైతన్య స్కూల్ బస్సు తనిఖీ

**::: విక్రాంత్ కుమార్ సింగ్, ఐపిఎస్**

భద్రాచలం, జనవరి 6, నవతరం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలంలో మంగళ వారం విక్రాంత్ కుమార్ సింగ్ స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. స్కూల్ బస్సు పత్రాలు మరియు డ్రైవర్లను పరీక్షంచి వారి డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించారు. విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంఘం వెంకట పుల్లయ్య, అసిస్టెంట్ మోటార్ వెహికల్ఇన్స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, కళాశాల సిబ్బంది, బస్సుడ్రైవర్లు, బస్సుఓనర్లు పాల్గొన్నారు.

---




# రుణ మాఫీ చేయట్లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన రైతు

## రూ.2 లక్షల లోపు రుణం ఉన్నవారికి రుణమాఫీ చేస్తున్నట్లు జీవో విడుదల చేసినా తనకు రుణమాఫీ కాలేదని పిటిషన్ దాఖలు

నవతరం అశ్వారావుపేట : యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం, జంగారెడ్డిపల్లి గ్రామంలో తనకున్న వ్యవసాయ భూమిపై, అరూర్ గ్రామంలోని ్నరా బ్యాంకులో రూ.1.50 లక్షల రుణం తీసుకున్న నరసింహారెడ్డి అనే రైతు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల లోపు ఉన్న వారికి రుణమాఫీ చేస్తున్నట్లు జీవో 567 విడుదల చేసిందని, కానీ తన రుణం మాఫీ కాలేదని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన రైతు. కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వం తరపు న్యాయవాది సమయం కోరడంతో విచారణ వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు.

# కార్పొరేట్‌స్థాయి వైద్యం భద్రాచలంలో

### 27 మంది వైద్య సిబ్బందితో వైద్యం అందించడానికి పటిష్టంగా భద్రాచలం ఏరియా ఆసుపత్రి

### యువతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి



నవతరం అశ్వారావుపేట : తెలంగాణలో భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాం అంటున్న ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ మరియు ఆర్ ఎం ఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని, మన ప్రభుత్వాసుపత్రిలో అందిస్తున్నారని, నిత్యం పేద ప్రజలకు అండగా ఉండడానికి కృషి చేస్తున్నారని, కావున భద్రాచలం ప్రజలు మరియు భద్రాచలం చుట్టుపక్కల గ్రామస్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి యువతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు. భద్రాచలం ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఇటీవల జరిగిన పరిస్థితులు బట్టి ఎటువంటి ఇబ్బందున్న భద్రాచలం ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ మరియు ఆర్ ఎం ఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ముందుండి అందరికీ మెరుగైన వైద్యం అందించి ఎంతోమంది ప్రాణాలు కాపాడారు.అలాగే ప్రభుత్వాసుపత్రిలో 27 మంది వైద్య సిబ్బందితో వైద్యం అందించడానికి పటిష్టంగా భద్రాచల ఏరియా హాస్పిటల్ ఉంది అంటే దానికి కారణం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ మరియు భద్రాచలం ఐటీడీఏ పీవో మరియు డిఎంహెచ్వో మరియు డి సి హెచ్ ఎస్ మరియు భద్రాచలం ఏరియా హాస్పిటల్ సూపర్డెంట్ మరియు ఆర్ ఎం ఓ వైద్య బృందం యొక్క కృషితో ఇవాళ భద్రాచలం ఏరియా హాస్పిటల్ ఒక మైలురాయిగా మిగిలింది. నాలుగు రాష్ట్రాల సరిహద్దు కేంద్ర ప్రాంతమైన భద్రాచలం అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తామని వైద్య బృందం హామీ ఇస్తున్నారు. కావున ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేదలు నిరుపేదలు బడుగు బలహీన వర్గాలకు ఒక అద్భుతమైన అవకాశం అని కార్పొరేట్ స్థాయి వైద్యం కోసం వారు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని ఎటువంటి వైద్యం నిర్లక్ష్యమైన సరే వెంటనే సూపర్డెంట్ ని లేదా భద్రాచల మై టిడిపిఓ ని లేదా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కు తెలపాలని ఇంకా మెరుగైన వసతులు సదుపాయాలు తీసుకురావడానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య యంత్రాంగం మరియు భద్రాచలం ఏరియా హాస్పిటల్ వైద్య బృందం కృషి చేస్తుందని గుజ్జుల వేణుగోపాల్ రెడ్డి యువతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు.

# మద్యం షాపులు తొలగించండి

### అతి పవిత్రమైన నాగేంద్ర స్వామి గుడి పక్కన ఉన్న వైన్స్‌షాప్ తొలగించాలని బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

### హిందూల మనో భావాలు దెబ్బతినేలా చేస్తున్న మద్యం సిండికేట్

### నాగేంద్రస్వామికి మరియు స్థానిక సర్పంచ్కి వినతి పత్రం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట లో జీడి గింజల సెంటర్ నందు గల అతి పవిత్రమైన నాగేంద్ర స్వామి గుడికి దగ్గరగా ఉన్న వైన్స్ (మద్యం) షాప్ నీ తొలగించాలని దమ్మపేట బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు పై ధర్నా నిర్వహించి అనంతరం నాగేంద్ర స్వామి కి మరియు స్థానిక సర్పంచ్కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.బీజేపీ నియోజకవర్గ నాయకులు తంబళ్ల రవి మాట్లాడుతూ దేవాలయం పక్కన ఏర్పాటు చేసిన మద్యం షాప్ ని తొలగించి ఆలయ పవిత్రతను,ఆ స్థల పవిత్రతను,హిందూ ధర్మాన్ని కాపాడాలని...హిందువుల మనోభావాలు దెబ్బ తినేలా ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేశారనీ అధికారులకు పదే పదే వినతి పత్రాలు ఇస్తున్నా కూడా కనీసం స్పందన లేని కారణంగా ఇ రోజు రోడ్డు ఎక్కి నిరసన తెల్పాల్సిన పరిస్థితి ఏర్పడినదనీ ,ఇప్పటికైనా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ అధికారులు మరియు కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి తక్షణమే గుడి పక్కనే ఉన్న మద్యం షాప్ ని తొలగించి గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయించాలని,స్పందించనీ ఎడల హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బిజెపి పార్టీ తరఫున హెచ్చరిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గొట్టి పూళ్ల శ్రీనివాసరావు,కొలీకపోగు ముసలయ్య,గూడా ముత్యాలరావు,దారా సతీష్,సోయం వెంకట్,నాగరాజు,మహిళా నాయకులు కారం రత్నకుమారి,ఆళ్ళ సుజాత,బెల్లం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# రూ.50,000 లంచం తీసుకుంటూ.. ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ తహసీల్దార్

### కామారెడ్డి జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్

### భూమి బదిలీ రిపోర్ట్ కోసం రూ.50 వేలు డిమాండ్

### ప్రైవేట్ వ్యక్తి ద్వారా లంచం స్వీకరిస్తూ ఏసీబీకి చిక్కిన వైనం


### తహసీల్దార్, మధ్యవర్తిని అరెస్ట్ చేసిన అధికారులు

### లంచం అడిగితే 1064కి కాల్ చేయాలని ఏసీబీ సూచన



కామారెడ్డి జిల్లాలో ఓ తహసీల్దార్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నాగిరెడ్డిపేట మండల తహసీల్దార్ యార్లగడ్డ శ్రీనివాసరావు, ఓ ప్రైవేట్ వ్యక్తితో కలిసి రూ.50,000 లంచం స్వీకరిస్తుండగా మంగళవారం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఒక వ్యక్తి తన తండ్రి పేరు మీద ఉన్న వ్యవసాయ భూమిని తన పేరు మీదకు మార్చుకోవడానికి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ ప్రక్రియలో అనుకూలంగా నివేదిక పంపేందుకు తహసీల్దార్ శ్రీనివాసరావు రూ.50,000 లంచం డిమాండ్ చేశాడు. ఈ మొత్తాన్ని చిన్నూరి అజయ్ అనే ప్రైవేట్ వ్యక్తి ద్వారా తనకు అందజేయాలని సూచించాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. బాధితుడు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అజయ్ ద్వారా డబ్బులు అందజేస్తుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రసాయనం పూసిన నోట్లను స్వాధీనం చేసుకుని, వారి చేతులను పరీక్షించగా పాజిటివ్ రిజల్ట్ వచ్చింది. దీంతో తహసీల్దార్ శ్రీనివాసరావుతో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన అజయ్‌ను కూడా ఏసీబీ అరెస్ట్ చేసింది. అనంతరం ఇద్దరినీ హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు లేదా వాట్సాప్ (9440446106), ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా సమాచారం ఇవ్వాలని ఏసీబీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది.

# టిక్కెట్ ధరల పెంపు కోసం హైకోర్టుకు 'రాజాసాబ్', 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రాల నిర్మాతలు



సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదల కానున్న ప్రభాస్, చిరంజీవి సినిమాలుటిక్కెట్ ధరల పెంపుతో పాటు అదనపు షోలకు అనుమతి కోసం కోర్టులో పిటిషన్‌బుధవారం విచారణ చేపట్టనున్న హైకోర్టు డివిజన్ బెంచ్‌తెలుగు రాష్ట్రాల్లో టిక్కెట్ ధరల పెంపు, అదనపు షోలకు అనుమతి కోరుతూ 'రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్' చిత్ర నిర్మాతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభాస్ నటించిన 'రాజాసాబ్', చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రాలు విడుదల కానున్నాయి. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాల టిక్కెట్ ధరలు పెంచుకోవడానికి అవకాశం కల్పించాలని నిర్మాతలు ఇదివరకే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను కోరారు.టిక్కెట్ ధరలు పెంచకుండా, అదనపు షోలు కల్పించకుండా గతంలో సింగిల్ బెంచ్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో రెండు చిత్రాల నిర్మాతలు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. సింగిల్ బెంచ్ జడ్జి ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరారు. టిక్కెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల కోసం హోంశాఖ కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ విజ్ఞప్తిని పరిశీలించేలా హోంశాఖ కార్యదర్శికి సూచించాలని విజ్ఞప్తి చేశారు.అత్యవసర పిటిషన్ కింద విచారణకు స్వీకరించాలని నిర్మాతల తరఫు న్యాయవాదులు కోరగా, కోర్టు అందుకు నిరాకరించింది. ఈ పిటిషన్‌లపై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టనున్నట్లు తెలిపింది.కాగా, 'రాజాసాబ్' సినిమా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఒకరోజు ముందుగా (జనవరి 8) రాత్రి స్పెషల్ ప్రీమియర్లను ఏర్పాటు చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. తెలంగాణలో ఉదయం 4 గంటల షోకు అనుమతి ఇవ్వాలని కోరింది.

# ప్రజల పక్షన నిలవడమే జర్నలిస్టు లక్ష్యం కావాలి

### సామాజిక చైతన్యం తీసుకొచ్చే బాధ్యత జర్న లిస్టులుదే

### రాష్ట్ర మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు



నవతరం :శ్రీకాకుళం ప్రజల పక్షన నిలవడమే జర్నలిజం లక్ష్యం కావాలని, ప్రజలలో సామాజిక చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఆధారపడి ఉందని రాష్ట్ర మాజీ మంత్రి, వైయస్సార్సీపి రాష్ట్ర నేత ధర్మాన ప్రసాదరావు అన్నారు. మంగళవారం శ్రీకాకుళం లో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కి ప్రముఖ సీనియర్ జర్నలిస్టు తలగాపు వెంకట రమణ మర్యాదపూర్వకంగా కలిసినప్పుడు, ఆయన్ని దుశ్యాలువా కప్పి గౌరవంగా ధర్మాన ప్రసాదరావు సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం జర్నలిజం రంగంలో కొనసాగుతూ కొన్ని సామాజిక విలువలకు గౌరవం ఇస్తూ.. తన వంతు బాధ్యతగా కొంచెం కష్టమైనా అక్షర ఉద్యమంలో సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్న సీనియర్ జర్నలిస్టు తలగాపు వెంకటరమణ సేవలు ప్రశంసనీయమన్నారు. తన సుదీర్ఘ జర్నలిజం జీవితంలో వ్యక్తుల మెప్పు పొందడానికి, కీర్తి కాంత కానుకలను వెనకేసుకోవడానికి ఎన్నో అవకాశాలు వచ్చినా గాని, అటువంటి ప్రలోభాలకు లొంగకుండా, జర్నలిజం విలువలకు, నిబద్ధతకు కట్టుబడి, తాను నమ్ముకున్న సిద్ధాంతాన్ని కాపాడుకుంటూ రావడం ఆశ మసి వ్యవహారం కాదని, దీని వెనక ఎంతో క్రమశిక్షణ, దీక్ష దాగి ఉందన్నారు. వార్త, ప్రజాశక్తి, విశాలాంధ్ర దినపత్రికలతో పాటు వివిధ చిన్న, మధ్య తరహా పత్రికల్లో పనిచేస్తూ, ఈ ప్రాంత ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పాలకులతో పాటు ప్రతిపక్షలు దృష్టికి తీసుకు వచ్చే కథనాలను అందిస్తూ.. వస్తున్న జర్నలిస్టు తలగాపు వెంకటరమణ భవిష్యత్తులో కూడా మరెన్నో వ్యాసాలు, కథనాలు రాస్తూ.. ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని తీసుకురావడానికి కృషి చేయాలని మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి నేతలు అందవరపు సూరిబాబు, కేవెల్ ప్రసాద్, నక్క రామరాజు తదితరులు పాల్గొన్నారు.



### శ్రీవాణి టికెట్ల జారీపై టీటీడీ కీలక నిర్ణయం...

# జనవరి 9 నుంచి కొత్త విధానం

### రోజూవారీ కరెంట్ బుకింగ్ కింద ఆన్‌లైన్‌లో టికెట్ల కేటాయింపు

### అడ్వాన్స్ బుకింగ్, ఎయిర్‌పోర్ట్ కౌంటర్ విధానం యథతథం

### నెల రోజుల పాటు ప్రయోగాత్మకంగా కొత్త విధానం అమలు

తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక సమాచారం అందించింది. శ్రీవాణి దర్శన టిక్కెట్ల జారీ విధానంలో ముఖ్యమైన మార్పులు చేస్తున్నట్లు ప్రకటించింది. భక్తుల సౌలభ్యం, క్యూలైన్ల నివారణ లక్ష్యంగా ఇప్పటివరకు తిరుమలలో ఆఫ్‌లైన్‌లో జారీ చేస్తున్న శ్రీవాణి టిక్కెట్లను జనవరి 9వ తేదీ నుంచి నిలిపివేస్తున్నట్లు తెలిపింది. వీటికి బదులుగా ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించింది. ఈ కొత్త విధానం కింద, తిరుమలలో ఆఫ్‌లైన్‌లో ఇచ్చే 800 శ్రీవాణి టిక్కెట్లను ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులు టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చు. టిక్కెట్లు పొందిన వారు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనం కోసం తిరుమలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. టిక్కెట్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఆధార్, మొబైల్ నంబర్ ధృవీకరణ తప్పనిసరి చేశారు. ఒక కుటుంబం నుంచి గరిష్ఠంగా నలుగురికి (1o3) మాత్రమే బుకింగ్ అవకాశం కల్పించారు. ఈ నూతన విధానాన్ని నెల రోజుల పాటు ప్రయోగాత్మకంగా అమలు చేసి, ఆ తర్వాత సమీక్షించి తుది నిర్ణయం తీసుకుంటామని టీటీడీ అధికారులు తెలిపారు. ఆఫ్‌లైన్ టిక్కెట్ల కోసం భక్తులు గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా ఈ మార్పు చేశామని పేర్కొన్నారు. అయితే, ఇప్పటికే ఆన్‌లైన్‌లో మూడు నెలల ముందుగా జారీ చేస్తున్న 500 శ్రీవాణి అడ్వాన్స్ బుకింగ్ టిక్కెట్ల విధానం, అలాగే తిరుపతి విమానాశ్రయంలో ఆఫ్‌లైన్‌లో జారీ చేస్తున్న 200 టిక్కెట్ల విధానం యథవిధిగా కొనసాగుతాయని టీటీడీ స్పష్టం చేసింది. భక్తులు ఈ మార్పులను గమనించి, తమ దర్శన ప్రణాళికలను రూపొందించుకోవాలని విజ్ఞప్తి చేసింది.

### టిక్కెట్ల కోసం నా వద్దకు ఎవరూ రావొద్దు: జగ్గారెడ్డి



రానున్న మున్సిపల్ ఎన్నికల్లో టిక్కెట్ల కోసం తన వద్దకు ఎవరూ రావొద్దని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనను మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పిలవొద్దని స్పష్టం చేశారు.భవిష్యత్తులో ఎమ్మెల్యే కానున్న నిర్మలా జగ్గారెడ్డిని ఈ ఎన్నికల ప్రచారానికి పిలవాలని సూచించారు. జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణ ప్రజలు విశ్వసిస్తారని ఆయన అన్నారు. ఆమె గెలుపు కోసం చేసే వాగ్ధానాలన్నీ తానే నెరవేరుస్తానని భరోసా ఇచ్చారు. తన జీవితంలో తాను పోలీసులను ఎదిరించి రాజకీయం చేశానని గుర్తు చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని తాను ఎప్పుడూ రాజకీయం చేయలేదని అన్నారు.అధికారంలో ఉన్నామని పోలీసులను అడ్డుపెట్టుకుని గెలవాలని చూడవద్దని అన్నారు. ఈ ఎన్నికల్లో టిక్కెట్ల కోసం గాంధీ భవన్‌కు వెళ్లి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు ఇచ్చే హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి వాటిని నెరవేర్చే బాధ్యత తనదేనని అన్నారు. ఎన్నికల్లో పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను ఓడించాలని చూస్తే వారిపై వేటు ఖాయమని హెచ్చరించారు.

# పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలి !

**తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేరుస్తామని అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందుకు తగ్గట్లుగా అడుగులు వేయాలి. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న ఆకాంక్షలు త్వరగా నెరవేర్చాలి. ఇదే సందర్భంలో ఇక ఉచిత పథకాలను దరిచేరకుండా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలి.**




రైతుబంధు, రైతు రుణమాఫీలు,రూపాయికి కిలోబియ్యం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలకు చెక్ పెట్టాలి. పంటలను పూర్తి స్థాయిలో గిట్టుబాటు ధరలకు కొనడమే రైతులను ఆదుకోవడం అవుతుంది. వారికి సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం, పంటరుణాలను అందించడం,నీట వసతి కల్పించడం ప్రధాన ఎజెండా కావాలి. ఇవన్నీ కల్పించి పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకునేలా ఉండాలి. చిన్ననీటి వనరులను అభివృద్ది చేయాలి. ఇలా చేస్తే వ్యవసాయంతో పాటు, అనుబంధ రంగాలు కూడా అభివృద్ది చెందుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఇవి చేయకుండా నేలవిడిచి సాము చేయడం సరికాదు. అలాగే విద్యావైద్య రంగాలను కూడా గ్రామస్థాయి లో పటిష్టం చేయాలి. సాగు,తాగునీటి వనరులతో పాటు, పంటలు పండే భూములకు ఇక్కడ కొదువలేదు. పనిచేయడానికి జనం ఉన్నారు. వీటి ఎలా ఉపయోగించాలన్నది నేతల సమర్థత మీద ఆధారపడి ఉంది. పథకాలు, పందేరాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుని వెళ్లడం అసాధ్యం అని గుర్తించాలి. అలాగే గత కెసిఆర్ ప్రభుత్వంలా అభూతకల్పనలు,భ్రమలు కల్పించడం మానుకోవాలి.అప్పుడే గ్రామాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయి. పంచాయితీలను పటిష్టం చేసి వాటి ద్వారానే గ్రామాల పురోభివృద్ధికి పాటుపడాలి. రాజ్యాంగం ఇచ్చి అధికారాలను పంచాయితీలకు దఖలు పర్చాలి. తెలంగాణ ప్రజల బతుకులు మారాలన్న ఏకైక లక్ష్యంతో పోరాటం చేసి సాకారం చేసుకున్న ప్రత్యేక తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తి అయ్యాయి. నిజానికి ఇలాంటి చిన్న రాష్ట్రంలో అన్ని వనరులు ఉన్నా ప్రజల ఆకాంక్షలు తీరలేదు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పదేళ్లు కల్వంకుంట్ల కుటుంబం రాజభోగాలు అనుభవించింది. గడీల పాలన అందించింది. దీనిని నిందిస్తూ కాలయాపన చేయకుండా రేవంత్ సర్కార్ ముందుకు సాగాలి. అలాగే ఈ పదేళ్లలో తెలంగాణలో ఎవరి బతుకులు మారాయన్నది గమనిస్తే.. రాజకీయ పార్టీల్లో కొందరి బతుకులు మారాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంతో ప్రజల బతుకులు అలాగే ఉన్నాయి. ఈ క్రమంలో పదేళ్ల పాలనపైనా, ప్రజల జీవన చిత్రంపైనా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. రేవంత్ ప్రభుత్వం గత విధ్వంసాలను గుర్తించి ముందుకు సాగాలి. ప్రజలు ఏం కోరుకుంటున్నారో చర్చించాలి. మూసపద్దతిలో కాకుండా నిర్మాణాత్మక వైఖరితో ముందుకు సాగితే సింగపూర్, మలేషియా లాంటి చిన్నచిన్న దేశాలను అధిమించవచ్చు. నీళ్లు, నిధులు,నియామకాలు అన్న నినాదంలో ఏవీ సాకారం కాలేదు. గత ప్రభుత్వ తప్పిదాలను సమీక్షిం చుకుని ప్రజలు కోరుకుంటున్న విధంగా పాలన సాగించాలే కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేయాలి. లేకుంటే..రాజకీయాల్లో ప్రజలు తమదైన రీతిలో బుద్ది చెబుతారని గుర్తించాలి. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరవాత తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటు లోనూ.. పథకాలను అమలు చేయడంలోనూ.. అంతకు మించిన స్వార్థ ప్రణాళికతో కెసిఆర్ తొమ్మిదిన్నరేళ్లు పాలించారు. అందుకే ఆయన రాజకీయ జీవితం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా అప్రతిహతంగా కొనసాగింది. కానీ ప్రజలనే వారు ఎల్లవేళలా దేగకళ్లు పెట్టుకుని చూస్తుంటారని గమనించలేదు. ఇవాళ తెలంగాణ అమరవీరుల కోసం కన్నీరు కారుస్తానంటే ప్రజలు నమ్మరు. తవ్వినకొద్దీ అవినీతి పుట్టలు బయటపడుతున్నాయి. ఒక్కో పథకం తవ్వేకొద్దీ అవినీతే తప్ప ప్రజలకు మేలు చేసిన ఆనవాళ్లు కానరావడం లేదు. కాళేశ్వరంతో పాటు అనేక

ప్రాజెక్టులను కట్టినట్లు చెప్పి అవినీతిని పారించారు. చెరువులను పునరుద్దరించి గొలుసుకట్టు చెరువులకు ప్రాణం పోసామని డొల్ల మాటలు ప్రచారం చేశారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేసామని బుకాయించారు. హరితహారంతో పచ్చదనాన్ని పెంచామని చెప్పి పచ్చి అబద్దాలు చెప్పారు. అన్ని పథకాల్లో అవినీతి దాగివుందన్న సత్యం బయటకు రావడంతో ప్రజలతో పాటు ప్రపంచం కూడా విస్తుపోయింది.ప్రజలకు ఆదర్శ నేతగా నిలవాల్సిన కెసిఆర్ కేవలం తన కుటుంబం, తన బంధువుల కోసం స్వార్థ రాజకీయాలు చేసారని చెప్పడంలో సందేహం లేదు. ఓ రకంగా చెప్పాలంటే పదేళ్ల కెసిఆర్ పాలన అంతా గోబెల్స్ ప్రచారంతో సాగింది. ఇప్పుడు అధికారం కోల్పోవడంతో అదే పనిలో బిఆర్ఎస్ నేతలు ఉన్నారు. నిత్యం ఏదో ఒక ఆరోపణతో తమ గత పాపాలను బయటకు రాకుండా చూస్తున్నారు.తెలంగాణలో కెసిఆర్‌ను మించిన విజినరీ నేత లేదని అప్పుడూ, ఇప్పుడూ భ్రమింప చేస్తున్నారు. కరిమింగిన వెలగ పండులా ఆయన విజినరీ అంతా లోపాలపుట్ట అని తేలింది. అనేక ఆశలు,ఆశయాలతో, అమరుల త్యాగాల తో పురుడుపోసుకున్న తెలంగాణను అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నా, స్వార్థమనే పథకంలో కొట్టుకు పోయాయి. ఈ క్రమంలో పదినెలల రేవంత్ ప్రభుత్వం ఆర్భాటాలకు, అనవసర ఖర్చుల కు, ఉచిత పథకాల జోలికి పోకుండా క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారించాలి. తెలంగాణ అభివృద్దిని మళ్లీ పట్టాలకు ఎక్కించాలి. తాము ఇచ్చిన గ్యారెంటీల పేరుతో కాలక్షేపం చేయకుండా గ్రామస్థాయిలో సమస్యలను ఆకళింపు చేసుకోవాలి. గ్రామాలను బలోపేతం చేసి అభివృద్ది చేయాలి. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవ నినాదాలతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చామన్న ఘనత సాధించాలి. ఉద్యోగాల కల్పన, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచడం, వ్యవసాయాన్ని బలోపతేం చేయడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగించాలి.

(ఆధ్యాత్మిక చింతన)

## చిన్న తిరుపతిలో అశ్వయుజ బ్రహ్మోత్సవాలు

ప్రముఖ పుణ్య క్షేత్రం ద్వారకా తిరుమల చిన తిరుపతిలో ఆశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 5వ రోజు గురువారం చిన వెంకన్న మోహిని అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉదయం సింహ వాహనంపై స్వామివారి ఊరేగింపు జరగనుంది. అలాగే రాత్రి 8 గంటలకు స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం జరగనుంది. అనంతరం వెండి గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుంది. కాగా ద్వారకా తిరుమలలో ఏడాదిలో రెండు సార్లు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఒకసారి వైశాఖమాసంలో, మరోసారి అశ్వయుజ మాసంలో స్వామివారికి వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుపుతారు. ఈ బ్రహ్మోత్సవాలను ఎనిమిది రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. 18న (శు క్రవారం) ద్వారకా తిరుమలలోని మాఢ వీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. అశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు జరిగే 8 రోజులపాటు వివిధ వాహనాలపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ ఎనిమిది రోజులపాటు ద్వారకా తిరుమలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి.. చిన వెంకన్నను దర్శించు కుంటారు. కాగా బ్రహ్మోత్సవాల సందర్భంగా.. నిత్యార్జిత కళ్యాణాలు, సేవలను ఆలయ అధికారులు రద్దు చేశారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రధాన ఆలయంతో పాటు.. నాలుగు రాజగోపురాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం శ్రీహరి కళాతోరణంలో భక్తుల కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. భద్రత పరంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అన్నిరకాల చర్యలు చేపట్టారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు.18వ తేదీ రాత్రి ఏడు గంటలకు స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తారు. శనివారం (19వ తేదీ) ఉదయం ఏడు గంటలకు చక్రస్నానం, రాత్రి ఏడు గంటలకు శ్రీవారి ధ్వజావరోహణ కార్యక్రమాలు జరుగుతాయి.

## నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

### నాలుగు నెలలైనా అమలుకు నోచని హామీ



దసరా పండుగకు చేనేత సొసైటీల్లో వస్త్ర విక్రయాలకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందని ఆశించిన నేతన్నలకు నిరాశే మిగిలింది. పండుగకు ఇచ్చే రిబేటుపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో సాదాసీదాగానే వస్త్ర వ్యాపారం సాగింది. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్న నేతన్నలకు ఉచితంగా విద్యుత్ అందిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఈ హామీ అమలుకు నోచుకోలేదు. మరోపక్క రిబేటు, యార్న్ సబ్సిడీ పాత బకాయిలను ప్రభుత్వం విడుదల చేయలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోవడంతో నేతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, రాష్ట్ర విభజన తర్వాత 2014-19 మధ్యకాలంలోనూ చేనేత వస్త్ర ఉత్పత్తుల అమ్మకాలను ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. పండుగల రోజుల్లో సొసైటీల్లో వస్త్ర విక్రయాలపై 30 శాతం రిబేటు ప్రకటించాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత వస్త్ర విక్రయాలకు ప్రభుత్వాలు ఇచ్చే ప్రోత్సాహాలను, సొసైటీలకు విడుదల చేయాల్సిన రాయితీ బకాయిలను నిలిపివేసింది. తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది జూలై 13న రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఎస్.సవిత కృష్ణాజిల్లా పెడన, గూడూరు మండలాల్లో పర్యటించి ప్రసిద్ధి చెందిన చేనేత సొసైటీలను పరిశీలించారు. నేతన్నలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ప్రకటించారు. దీంతో గత టిడిపి హయాంలోలాగా సొసైటీల్లో వస్త్ర విక్రయాలపై పండుగలకు ప్రభుత్వం 30 శాతం రిబేటు ప్రకటిస్తుందని, తద్వారా ఈ ఏడాది వస్త్ర వ్యాపారం పెరుగుతుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. కృష్ణాజిల్లాలోని 37 సొసైటీల్లో ప్రతి ఏటా సగటున రూ.11.99 కోట్ల విలువైన 7,02,633 మీటర్ల చేనేత వస్త్రాల ఉత్పత్తి జరుగుతోంది. వినాయక చవితి, దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలకు గతంలో 30 శాతం రిబేటు ప్రకటించారు. ఆయా సందర్భాల్లో సొసైటీల్లో 35 శాతం వరకు చేనేత వస్త్ర విక్రయాలు పెరిగాయి. తాజాగా రిబేటుపై ప్రకటన చేయకపోవడంతో దసరా పండుగకు సాదాసీదాగానే వస్త్ర వ్యాపారం సాగింది. 2016-17 నుంచి 2018-19 వరకు మూడేళ్లలో పండుగలకు ప్రకటించిన 30 శాతం రిబేటు రూ. 6.11 కోట్లు, యార్న్ సబ్సిడీ మరో రూ. 6.96 కోట్లు మేర సొసైటీలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయలేదు.



## ఓ సంస్కారమా... నీకో నమస్కారం!

(నారీ స్వేచ్ఛకై గర్జించే ఓ గళం)

మేం మాల్స్‌కి వస్తాం...
మా అందాలు ఆరబోస్తాం...!
మేమింతే...అర్ధనగ్నంగా
అశ్లీలంగా ఉంటాం
మా ఒళ్ళు...
మా ఇష్టం!c అంటే ఎలా..?
నారీ స్వేచ్ఛకై గర్జించే గళాలు
అభ్యర్థిస్తున్నాయి ఆ అర్ధనగ్న
పాశ్చాత్య సంస్కృతి మనకొద్దని..!

మా కళ్ళు మా ఇష్టం..అంటాడో పోకిరి...
మా లాఠీ మా ఇష్టం...అంటాడో పోలీసు
పోకిరోళ్లకు శిక్ష మురికి కాలువల శుభ్రతే
పోకిరితనానికి...పొగరుబోతుతనానికి...
అహానికి..అజ్ఞానానికి..అందాల ఆరబోతకు..
ఇక చెక్ పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది..!

ఓ సంస్కారమా..!
నీకో నమస్కారం...
సిగ్గు, లజ్జా మాకేల...?
మేం వంటింటి కుందేల్లం కాదు
పిల్లల్ని కనే యంత్రాలం కాదు...
మేం పంజరాల్లో పక్షులం కాదు..
గదుల్లో తిరిగే గబ్బిలాలం కాదు..!

మేం వినువీధుల్లో
విహరించే విహంగాలం...
గాల్లో ఎగిరే గాలిపటాలం...
స్వేచ్ఛ...మా జన్మహక్కు..!

లోపం మాలో కాదు సృష్టిలో లేదు
కామాంధుడైన నరుని దృష్టిలోనే..!
మమ్మల్ని విచ్చలవిడిగా తిరగనివ్వండి..!

ఐతే ఓ అందమా...నీవెక్కడ...?
చీరకట్టులోనా...? స్త్రీ గుట్టులోనా...?
ఆమె నుదుటి బొట్టులోనా...? కాదు...

మరి ఓ అందమా...నీవెక్కడ...?
ఆత్మవిశ్వాసంలో స్వాభిమానంలో
స్త్రీ జాతి స్వేచ్ఛా స్వాతంత్ర్యంలో
కొండంత నిండుదనంలో నేనక్కడ..!

ఓ మహిళామణులారా...
ఇకనైనా తెలుసుకోండి...
తిండి మీ కోసమని...
వస్త్రాలు పరుల కోసమని...
కామాంధులు పుట్టరని...
కొందరిచే సృష్టించబడతారని..!

ఇది ఒక సభ్య సమాజం..
మన సభ్యతే...మన శోభ
మన సంస్కారమే...మన శక్తి
మన సాంప్రదాయమే...మన గౌరవం..!

భరతమాత మెడలో
మెరిసే మణిహారాలే మీరు..
మీ స్వేచ్ఛే...మీకు అందం...
మీ ఆత్మగౌరవమే...మీకు శోభ...
మీ అలంకరణే...మీకు ఆభరణం..!

ఆ అర్ధనగ్న వస్త్ర ధారణ
ఆ పాశ్చాత్య సంస్కృతి మనకేల..?
దేహాన్ని నిండుగా కప్పుకున్న వారే
దేవతామూర్తులు....సందేహమేల..?

**రచన: కవిరత్న సాహిత్యధీర**
**సహస్రకవిభూషణ్**
**పోలయ్య, కూకట్లపల్లి**
**అత్తాపూర్, హైదరాబాద్**

# సంపాదకీయం

## ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు, తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది.ప్రొఫెషనల్ అసిస్టెన్స్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ ఏప్రిల్‌లో ప్రచురించిన స్టేటస్ ఆఫ్ ఆదివాసీ లైవ్లీహుడ్ రిపోర్ట్, 2021 ప్రకారం, భారతదేశం లోని ఆదివాసీ జనాభా ఆదివాసీయేతర జనాభాతో పోలిస్తే పేద జీవన ప్రమాణాలను కలిగి ఉంది. దేశ జనాభాలో 8.6% మంది షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) ఉన్నారు. వారిలో ఎక్కువ మంది 'కొండలు మరియు అడవులు' తెగలుగా వర్గీకరించ బడ్డారు.ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ఆదివాసీ సంఘాలు అధికంగా నివసించే ప్రాంతాలను గుర్తించాలని రాష్ట్రాన్ని ఆదేశిస్తుంది. ఈ ప్రాంతాలలో వారిని, వారి గుర్తింపును పెంపొందించడానికి, వారిని అభివృద్ధి ప్రక్రియలో ఏకీకృతం చేయాలని నిర్దేశిస్తుంది. ఆర్టికల్ 275 రాష్ట్రాలకు ఆర్థిక కేటాయింపులు చేయడానికి స్పష్టమైన నిబంధనలను చేస్తుంది. ఆర్టికల్ 275 కింద నిధులతో కేంద్ర మద్దతు ఉన్న గిరిజన ఉప ప్రణాళికలతో పాటు గిరిజన ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి అనేక నిర్దిష్ట కార్యక్రమాలు రూపొందించి అమలు చేయబడ్డాయి. అయితే, ఈ ప్రయత్నాల ఫలితాలపై చాలా తక్కువ సమాచారం అందుబాటులో ఉందని నివేదిక ఎత్తి చూపింది. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటీ ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో గతకేసీఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంది కూడా.పోడు చేసుకుంటున్న ఆదివాసీలపై, పోడు భూముల్లో ఆదివాసీలు వేసుకున్న గుడిసెలను అటవీశాఖ అధికారులు తొలగించడం, దాడులు చేయడం, తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం, తమ గుడిసెలు తొలగించవద్దంటూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేయడం అక్కడక్కడా చోటు చేసుకుంటు న్నాయి. 1/70, పీసా, అటవి హక్కుల చట్టం అమలు చేయాలని, ఏజెన్సీలో భూ దురాక్రమణపై కమిటీ వేయాలని,ఏజెన్సీ ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా కలిపి స్వయం పాలన కల్పించాలని, ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు సంపూర్ణంగా ఆదివాసీలకే కేటాయించాలని, గొండు, కోయ వారికి పదో తరగతి వరకు వారి మాతృభాషలోనే బోధన చేయాలని, జిఒనెం.3ని అమలు చేయాలని ఆదివాసీలు చేసే డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తూ, గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యంగా, అత్యవసరంగా చేయాల్సి ఉంది.

# శీతాకాలం.. గుండె పదిలం!




తీవ్రమైన చలివాతావరణం, ఆకస్మిక శీతగాలులు గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి. ఈ సీజన్‌లో గుండెపోటు కేసులు అత్యధికంగా నమోదవ్వటంతోపాటు గుండె సంబంధిత మరణాలు కూడా ఎక్కువగా కనిపిస్తుంటాయి. చలిగాలులు, జీవనశైలి మార్పులు గుండెపై ప్రభావాన్ని చూపిస్తాయి. చలివల్ల మనలో చురుకుతనం తగ్గటం, నిద్రమత్తు ఎక్కువగా ఉండటం, సోమరితనం, ఒకేచోట కదలకుండా ఎక్కువసేపు ఉండిపోవడంవల్ల గుండె ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది. ఈరోజు వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వయస్సుల వారికి గుండె సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా యువతలో గుండెపోటు సమస్యలకు శీతాకాలం ట్రిగ్గర్‌గా పనిచేస్తుంది. చలి, ఒత్తిడి, అనారోగ్యకరమైన అలవాట్లు మొదలైవి. శీతాకాలంలో గుండెపోటు రావడానికి కారణాలు అవుతున్నాయి. అతిచల్లదనంవల్ల శరీరం వెచ్చఉండటానికి రక్తనాళాలు ముఖ్యంగా కరోనరీ ఆర్టరీస్ (ధమనులు)సంకోచించడం, ఈ కాలంలో శరీర వ్యాయామం తక్కువయ్యి చెమట తక్కువగా ఉండటం వల్ల రక్తపరిమాణం పెరగటంతో రక్తపోటు అధికమవ్వడం, చలికి జీవక్రియ (మెటబాలిజం) నెమ్మదించడం, కొన్ని హార్మోన్ల ప్రభావంతో రక్తం గడ్డకట్టే స్వభావం ఎక్కువయ్యి గుండె సిరల్లో చిక్కుకొని రక్తప్రసరణను అడ్డుకోవడం వల్ల గుండెపోటు ప్రమాదాలు ఎక్కువ అవుతాయి. శీతాకాలం హృదయనాళ వ్యవస్థను అనేక విధాలుగా ప్రభావితం చేస్తుంది. అంతర్లీన గుండెజబ్బులు ఉన్నవారు ఈ సీజన్‌లో చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా వయో వృద్ధులు, హై బి.పి, షుగర్, ఇదివరకే గుండెజబ్బు ఉన్నవాళ్లు చాలాజాగ్రత్తగా ఉండాలి. 'కరోనరీ ఆర్టరీ డిసీజ్ ఉన్న వారిలో శీతాకాలంలో 'ఆంజినా'(ఛాతీ నొప్పి) తరుచూ వచ్చే అవకాశం ఉంటుంది. చల్లని వాతావరణంవల్ల రక్తనాళాలు కుచించుకుపోయి (వాసోకన్‌స్ట్రక్షన్), సహజ ప్రతిస్పందనవల్ల రక్త పోటు పెరగటం, గుండెకు ఆక్సిజన్ సరఫరా డిమాండ్ పెరగటం, శరీరానికి కావలసిన రక్తాన్ని గుండె సరిగా సరఫరా చెయ్యలేకపోవటం వల్ల గుండె వేగంగా కొట్టుకోవడం, గుండెపై ఒత్తిడి పెరిగి స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంటుంది. ఇంకొక సాధారణ సమస్య 'అరిథ్మియా'. ఆకస్మిక ఉష్ణోగ్రత మార్పుల వల్ల, శీతాకాలంలో క్రమరహిత గుండె లయలు ఏర్పడుతాయి. చల్లనిగాలి గుండె విద్యుత్ వ్యవస్థను చికాకుపెడుతూ, దుర్బలవ్యక్తుల్లో అసాధారణ లయలు ఏర్పడుతాయి. శీతాకాలంలో శారీరక చురుకుదనం తగ్గిపోవడం, వేపుళ్లు, మసాలాలు ఎక్కువగా తినడం, అధిక ఒత్తిడి కూడా గుండెకు చేటుతెస్తాయి. శరీరం బరువును అదుపులో ఉంచుకోవాలి. ఎందుకంటే, అధిక బరువువల్ల ముఖ్యంగా యువతలో హృదయ స్పందనరేటు పెరుగుతుంది తద్వారా గుండెపై భారం పడుతుంది. చలికాలంలో గుండె సమస్యలు ఇబ్బంది పెట్టకుండా ఎలా నిర్వహించాలి? శరీర ఉష్ణోగ్రతలు పడిపోకుండా వెచ్చని దుస్తులు ధరించాలి. నడక, యోగలాంటి స్వల్ప వ్యాయామాలు చెయ్యాలి. మెడిటేషన్ (ధ్యానం ) కూడా బాగా ఉపయోగపడుతుంది. పొగతాగడం, మద్యం మానెయ్యాలి లేదా బాగా తగ్గించాలి. పోషకాలు అధికంగా ఉండే తాజా ఆహార పదార్థాలు, పప్పుధాన్యాలు, పండ్లు, గింజలు, తృణధాన్యాలు మొదలైవి ఎక్కువగా తీసుకుంటూ, దాహం అనిపించకపోయినా మంచినీళ్లు బాగా (గోరువెచ్చగా) తాగాలి.దీనివల్ల ఆరోగ్యం ఆకస్మికంగా ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. గుండె వైఫల్యం చెందేవరకు మనం గమనించలేమని తెలుసుకోవాలి. వృద్ధులు, గుండెజబ్బులు ఉన్నవారు, అధికరక్తపోటు, మధుమేహం ఉన్న వారు, శరీరబరువు అధికంగా ఉన్నవారు, అతి బలహీనంగా ఉన్నవారు, మానసికంగా ఒత్తిడిలో ఉన్నవారు, ఆరుబయట ఎక్కువసేపు పని చేసేవారు, చలిప్రభావం వల్ల మాత్రమే అసౌకర్యంగా ఉండవచ్చని నిర్లక్ష్యం చెయ్యకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని, అవసరం అనిపిస్తే వైద్య సలహా తీసుకోవడం మంచిది. రక్తపోటు(బిపి), షుగర్, కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోండి. ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా తలతిరుగుతున్నట్లు అనిపిస్తే, ఎడమచేయి, మెడ, దవడతోపాటు వీపుకు ప్రసరించే నొప్పి, అసాధారణ అలసట, ఆకస్మిక బలహీనత, మైకంగా ఉండటంవంటి లక్షణాలు నిరంతరంగా ఉన్నట్లు అనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించండి. ఈ చిన్నమార్పులతో, శీతాకాలంలో గుండెపోటు ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. అకాల మరణాలను కూడా నివారించవచ్చు !


# బీఆర్ఎస్ పార్టీపై పేలిన తూటాలు

కల్వకుంట్ల కవిత శాసన మండలిలో చేసిన వ్యాఖ్యలు ఇటీవలి తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారాయి. ఆమె మాటలు కేవలం సభా ప్రాంగణానికే పరిమితం కాకుండా, గత దశాబ్ది పాలన తీరుపై, నైతిక విలువలపై, అవినీతి ఆరోపణలపై, రాజకీయ వ్యూహాలపై విస్తృత ప్రజా చర్చకు దారి తీశాయి. భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్న పదేళ్ల కాలం నుంచి ప్రతిపక్ష స్థితికి చేరిన తర్వాత ఎదుర్కొంటున్న రాజకీయ ఒత్తిళ్లు, కేంద్ర?రాష్ట్ర సంబంధాల్లో ఏర్పడిన ఉద్రిక్తతలు, దర్యాప్తు సంస్థల చర్యలపై నెలకొన్న అనుమానాలే ఈ వ్యాఖ్యలకు నేపథ్యంగా కనిపిస్తున్నాయి. శాసన మండలిలో కవిత చేసిన వ్యాఖ్యల్లో తనపై, తన పార్టీపై వస్తున్న ఆరోపణలను రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరించే ప్రయత్నం స్పష్టంగా కనిపించింది. అవినీతి ఆరోపణలను ఆమె ఖండిస్తూ, కేంద్రంలోని అధికార పార్టీ తన రాజకీయ ప్రత్యర్థులను అణిచివేయడానికి విచారణ సంస్థలను ఆయుధాలుగా ఉపయోగిస్తోందన్న వాదనను ముందుకు తెచ్చారు. ఇది వ్యక్తిగత రక్షణకే పరిమితం కాకుండా, సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాల హక్కులు, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత వంటి మూలభూత అంశాలను కూడా స్పృశించింది. గతంలోనూ బీఆర్ఎస్ నేతల నుంచి ఇలాంటి వాదనలు వినిపించినా, శాసన మండలి వేదికపై అధికారికంగా రావడం వల్ల ఈ వ్యాఖ్యలకు రాజకీయంగా మరింత బరువు ఏర్పడింది. అవినీతి ఆరోపణల అంశం న్యాయస్థానాల్లో తేలాల్సినదైనా, రాజకీయంగా మాత్రం అవి పార్టీ ప్రతిష్ఠపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో చేపట్టిన భారీ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, పరిపాలనా నిర్ణయాలపై ఇప్పటికే విపక్షాలు ప్రశ్నలు లేవనెత్తాయి. ఇప్పుడు వ్యక్తిగత నేతలపై వచ్చిన ఆరోపణలు ఆ విమర్శలకు కొత్త ఊపును ఇచ్చాయి. అయితే "ఆరోపణలే తప్ప నిర్ధారణలు లేవు" అన్న వాదనను బీఆర్ఎస్ తన రక్షణగా వినిపిస్తోంది. కవిత వ్యాఖ్యలు కూడా ఇదే దిశగా సాగుతూ, తనపై జరుగుతున్న ప్రచారాన్ని రాజకీయంగా ఎదుర్కొనే ప్రయత్నంగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్‌పై చూపే ప్రభావం ద్విముఖంగా ఉండే అవకాశముంది. ఒకవైపు పార్టీ శ్రేణులు, అనుచరుల్లో తమ నాయకులపై అన్యాయం జరుగుతోందన్న భావన బలపడుతూ, పార్టీ మరింత ఏకతాటిపై నిలబడే అవకాశం ఉంది. మరోవైపు, తటస్థ ఓటర్లు, పట్టణ మధ్యతరగతి వర్గాల్లో మాత్రం అవినీతి ఆరోపణలు పదే పదే వినిపించడం వల్ల పార్టీపై అనుమానాలు పెరిగే ప్రమాదం ఉంది. ఎన్నికల వాతావరణం దగ్గరపడుతున్న కొద్దీ, ఈ ఆరోపణలు రాజకీయ ప్రత్యర్థులకు బలమైన ప్రచార ఆయుధాలుగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఇదే సమయంలో బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఏమి సాధించిందని జాతీయ రాజకీయాలపై ఆశలు పెట్టుకుందన్న ప్రశ్న కూడా రాజకీయంగా గట్టిగా వినిపిస్తోంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ద్వారా ప్రజల ఆకాంక్షల్ని ప్రతిబింబిస్తూ అధికారంలోకి వచ్చిన పార్టీ, కాలక్రమంలో ఉద్యమ స్ఫూర్తిని పక్కన పెట్టి అధికార కేంద్రీకరణ, కుటుంబ రాజకీయాలు, ఆర్భాట పాలన వైపు మళ్లిందన్న విమర్శలు బలపడ్డాయి. రాష్ట్రంలోనే ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా నిలబెట్టుకోలేని పరిస్థితిలో, జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామన్న ఆలోచన రాజకీయ వాస్తవాలకు దూరంగా ఉందన్న భావన విస్తరిస్తోంది.ఈ నేపథ్యంలోనే "వ్యక్తిగా వెళ్లి, తిరిగి శక్తిగా చట్ట సభకు వస్తా" అన్న ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది కేవలం వ్యక్తిగత ఆత్మ విశ్వాస ప్రకటనగా కాకుండా, బీఆర్ఎస్‌లో చోటు కోల్పోయిన ఉద్యమ కారుల అసంతృప్తికి ప్రతిరూపంగా మారింది. ముఖ్యంగా ఇరిగేషన్ శాఖలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారీ అవినీతి, వేల కోట్ల ప్రాజెక్టుల చుట్టూ నెలకొన్న అనుమానాలు, ప్రజాధన దుర్వినియోగంపై వస్తున్న విమర్శలు ఈ వాదనలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు రైతులకు ఎంతవరకు మేలు చేశాయన్న దానికన్నా, వాటి ద్వారా ఎవరు లాభ పద్దారన్న ప్రశ్నే ప్రజల్లో ఎక్కువగా చర్చకు వస్తోంది. రాజకీయ శక్తిగా కొత్త వేదికను నిర్మిస్తానన్న సంకల్పం, ప్రస్తుతం ఉన్న పార్టీలపై ప్రజల్లో పెరుగుతున్న నిరాశకు ప్రత్యుత్తరంగా కనిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ కాలంలో ముందువరుసలో నిలిచిన అనేక మంది కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌లో క్రమంగా పక్కన పద్దారని, ఉద్యమ ద్రోహులు పార్టీలో కీలక స్థానాలు దక్కించు కున్నారని ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. ఉద్యమ సమయంలో త్యాగాలు చేసినవారికి గౌరవం దక్కలేదన్న భావన, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవడమే దీనికి ప్రధాన కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.వచ్చే ఎన్నికల్లో 'జాగృతి' పోటీ చేయాలన్న ప్రకటన కూడా ఈ అసంతృప్తికి రాజకీయ రూపమివ్వాలన్న ప్రయత్నంగా చూడాలి. ఇది బీఆర్ఎస్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణ రాజకీయ వ్యవస్థ మొత్తానికే సవాల్‌గా మారే అవకాశముంది. ఉద్యమ కారులు, యువత, నిరుద్యోగులు, రైతులు వంటి వర్గాలు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయాల కోసం ఎదురుచూస్తున్న వేళ, ఈ ప్రయత్నం ఎంతవరకు ప్రజల మద్దతు సంపాదిస్తుందన్నది కీలక ప్రశ్నగా నిలుస్తోంది. అత్యంత దయనీయంగా తనను పార్టీ నుంచి సాగనంపారన్న వేదన, బీఆర్ఎస్‌లో భిన్న స్వరాలకు చోటు లేదన్న ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది. ఉద్యమ కారులకు బీఆర్ఎస్‌లో స్థానం లేదన్న వ్యాఖ్య, పార్టీ మారిన రాజకీయ స్వభావాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ఒకప్పుడు ప్రజా ఉద్యమానికి ప్రతీకగా నిలిచిన పార్టీ, ఇప్పుడు అధికారాన్ని కాపాడుకునే రాజకీయ యంత్రాంగంగా మారిందన్న అభిప్రాయం బలపడుతోంది. మొత్తంగా చూస్తే, కల్వకుంట్ల కవిత శాసన మండలిలో చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగత రాజకీయ రక్షణ ప్రకటనగా మాత్రమే కాకుండా, తెలంగాణలో మారుతున్న రాజకీయ సమీకరణాలకు అద్దం పట్టే ఘటనగా నిలుస్తున్నాయి. అవినీతి ఆరోపణలు, వాటిపై ప్రతివాదాలు, ఉద్యమ వారసత్వంపై జరుగుతున్న చర్చలు, కొత్త రాజకీయ వేదికల ఆవిర్భావం?ఇవన్నీ రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను మరింత ఉత్కంఠభరితంగా మార్చే సూచనలు ఇస్తున్నాయి. బీఆర్ఎస్ ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మలుచుకో గలుగుతుందా, లేక ఆరోపణలు, అసంతృప్తుల భారంతో మరింత ఒత్తిడికి లోనవుతుందా అన్నది రానున్న రాజకీయ పరిణామాలే తేల్చనున్నాయి.

# ఇది అమెరికా దోపిడీ రాజ్యం

వెనిజులాపై అమెరికా దురాక్రమణ చర్య కేవలం అక్కడి చమురు, ఖనిజ వనరులను దోచుకోవడానికే అన్నది వాస్తవం. ఈ చర్యతో పశ్చిమార్ధగోళ కూటమికి ఆధిపత్యం వహించాలనే దురాలోచనతో ట్రంప్ తరువాతి వంతు మెక్సికో, క్యూబా, కొలంబియా దేశాలదేనని హెచ్చరించడం అమెరికా సామ్రాజ్యవాద కాంక్ష పరాకాష్టకు దారితీస్తోంది. చైనా, రష్యా, భారత్ వంటి పోటీదారులను నిరోధించడానికి, మార్కెట్లు, సహజ వనరులపై నియంత్రణ సాధించాలన్న అమెరికా లక్ష్యం కనిపిస్తోంది. సహజ వనరులు అపారంగా ఉన్న లాటిన్ అమెరికాలోని వామపక్ష ప్రభుత్వాలను కూలదోయడం, అక్కడ తన గుత్తాధిపత్యాన్ని నిలబెట్టుకోడానికి ఎత్తుగడలు పన్నడం అమెరికా సామ్రాజ్యవాద కాంక్షగా సాగుతోంది. ఈ దాడి ఐక్యరాజ్యసమితి నిబంధనలను, అంతర్జాతీయ చట్టాలను, ప్రపంచ దేశాల సార్వభౌమాధికారాన్ని ధిక్కరించడమే అవుతుంది. ప్రపంచంలోనే అత్యధికంగా వెనెజులాలో 303 బిలియన్ బ్యారెల్లకు పైగా చమురు నిక్షేపాలు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా చమురు నిక్షేపాల్లో ఇది ఐదో వంతు. అదే అమెరికా, రష్యాలో చెరి 80 బిలియన్ బ్యారెళ్లు ఉండగా, సౌదీ అరేబియాలో 267 బిలియన్ బ్యారెళ్ల చమురు నిక్షేపాలు ఉన్నాయి. వెనిజులాలో చమురును శుద్ధి చేయడానికి ఖర్చు చాలా తక్కువ. అందుకనే అమెరికా వెనిజులాను స్వాధీనం చేసుకోవడానికి దాడి చేసింది. అయితే అత్యధికంగా చమురు నిల్వలు వెనెజులాలో ఉన్నప్పటికీ వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకునే పరిస్థితి వెనెజులాకు లేకపోవడం చాలా లోపం. ఫలితంగా చమురు పరిశ్రమలు అనేక సంవత్సరాలుగా సంక్షోభంలో అల్లాడుతున్నాయి. సరైన నాయకత్వం లేకపోవడం, అవినీతి, అమెరికా ఆంక్షలు, పరిశ్రమ లోకి పెట్టుబడులు రాకపోవడం ఇవన్నీ వెనెజులాను పట్టిపీడిస్తున్నాయి. ఈ కారణాల వల్ల 25 ఏళ్ల క్రితం రోజుకు మూడు మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును ఉత్పత్తి చేసే వెనెజులా ప్రస్తుతం ఒక మిలియన్ బ్యారెళ్ల స్థాయికి పడిపోయింది. ఈ విధంగా ఉత్పత్తి చేసే చమురులో సింహభాగం అంటే రోజుకు 6,00,000 బ్యారెళ్లను చైనా దిగుమతి చేసుకుంటోంది. వెనెజులాను ఆర్థికంగా చైనా ఆదుకుంటోంది. చమురు రంగంలో ముమ్మరంగా పెట్టుబడులను పెట్టింది. రష్యా చమురు కూడా దాదాపు వెనెజులా ముడిచమురు మాదిరిగానే ఉండడంతో భారత్, చైనా లాంటి దేశాలు రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వెనెజులాలో ఉత్పత్తి పెరిగితే అది రష్యాకి ప్రత్యామ్నాయంగా తయారై, ఇప్పటి దాకా రష్యా దగ్గర ముడిచమురును కొంటున్న దేశాలు క్రమంగా వెనెజులా వైపు మొగ్గు చూపుతాయని, దీనివల్ల రష్యా ఆర్థికంగా దెబ్బతినడమే కాక, ఉక్రెయిన్‌పై యుద్ధంచేసే సామర్థ్యాలు రష్యాకు తగ్గుతాయని అమెరికా ఆలోచిస్తోంది. ఆమేరకు రష్యాను కట్టడి చేయవచ్చని అమెరికా ఎత్తుగడ.అంతేకాక, ప్రపంచం లోనే అత్యధికంగా రోజుకు 2022 మిలియన్ బ్యారెళ్ల చమురును అమెరికా ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, వెనెజులాలో తయారయ్యే రకం చమురును అమెరికా కొంతవరకు దిగుమతి చేసుకుంటోంది.అమెరికా తయారు చేసే లైట్ స్వీట్ రకం ముడిచమురు పెట్రోల్ వంటి వాటి తయారీకి మాత్రమే ఉపయోగపడుతుంది. డీజిల్‌తోపాటు ఫ్యాక్టరీలు ఇతర అవసరాలకు కావలసిన ఉత్పత్తులను తయారు చేయాలంటే వెనెజులా సరఫరా చేసే హెవీ, సోర్ రకం ముడిచమురు ముఖ్యం.అనేక అమెరికన్ రిఫైనరీలు వెనెజులా హెవీ ఆయిల్‌ను ప్రాసెస్ చేయడానికి అనువుగా నిర్మాణమై ఉన్నాయి. అమెరికా చమురుతో పోలిస్తే వెనెజులా చమురుతోనే అవి సమర్థంగా పనిచేస్తాయి.




## సైలెంట్ హిట్‌గా మారిన 'శంబాల'
## ఆది సాయికుమార్‌కి ఊపిరి పోసిన హారర్ అడ్వెంచర్

డిసెంబర్ 25న విడుదలైన పలు సినిమాల మధ్య పెద్దగా హడావిడి లేకుండా వచ్చి అనూహ్యంగా మంచి ఫలితాన్ని అందుకున్న చిత్రం శంబాల. భారీ బ్లాక్‌బస్టర్ టాక్ కాకపోయినా, "ఒక్కసారి థియేటర్‌లో చూసేయొచ్చు" అనే పాజిటివ్ వర్డ్ ఆఫ్ మౌత్‌తో ఈ సినిమా నిలకడగా ప్రేక్షకులను ఆకర్షించింది. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆది సాయికుమార్‌కి 'శంబాల' ఒక కీలక మలుపుగా మారింది. సినిమా రిలీజ్‌కు ముందే టీజర్, ట్రైలర్‌లు ఆసక్తిని పెంచాయి. హారర్‌అడ్వెంచర్ జానర్‌లో కొత్త ప్రయత్నంగా కనిపించిన కంటెంట్‌కి థియేటర్లలో ఆదరణ లభించింది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్ రావడంతో వసూళ్ల పరంగా కూడా సినిమా ఆశించిన దానికంటే మెరుగ్గా రాణిస్తోంది. మేకర్స్ విడుదల చేసిన సమాచారం ప్రకారం 'శంబాల' ఇప్పటివరకు రూ.20 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. షేర్ పరంగా చూస్తే దాదాపు రూ.11 కోట్ల వరకు వచ్చింది. మొత్తం బిజినెస్ సుమారు రూ.5 కోట్లుగా ఉండటంతో, సినిమా ఇప్పటికే మంచి లాభాల దిశగా దూసుకెళ్తోంది. ప్రస్తుత రన్ చూస్తే ఫైనల్‌గా రూ.25 కోట్ల గ్రాస్ దాటే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అదనంగా హిందీ వెర్షన్ రిలీజ్ కూడా ప్లాన్‌లో ఉండటంతో రెవెన్యూ మరింత పెరగనుంది.యుగంధర్ ముని దర్శకత్వంలో రూపొందిన ఈ హారర్ అడ్వెంచర్ చిత్రం శంబాల అనే పురాతన గ్రామం చుట్టూ తిరుగుతుంది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఆ గ్రామంలో 1980లలో ఓ ఉల్క పడిన తర్వాత వింత ఘటనలు మొదలవుతాయి. గ్రామస్తులు దానిని 'బండ భూతం'గా భావిస్తారు. పాలకు బదులుగా రక్తం రావడం, వరుస హత్యలు, అనూహ్య మరణాలు గ్రామాన్ని భయాందోళనలకు గురిచేస్తాయి. ఈ పరిస్థితులను పరిశీలించేందుకు ప్రభుత్వం పంపిన సైంటిస్ట్ విక్రమ్ (ఆది సాయి కుమార్) ఆ గ్రామంలో అడుగుపెడతాడు. అక్కడి దేవత కథ, గ్రామ చరిత్ర, వరుస ఘటనల వెనుక ఉన్న రహస్యాలు క్రమంగా బయటపడతాయి. సస్పెన్స్‌తో పాటు హారర్ ఎలిమెంట్స్‌ను బ్యాలెన్స్ చేయడం సినిమా ప్రధాన ఆకర్షణగా నిలిచింది.కొత్తదనం ఉన్న కథనాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారనడానికి 'శంబాల' ఒక ఉదాహరణగా నిలిచింది. ఆది సాయికుమార్‌కి ఇది కేవలం హిట్ మాత్రమే కాకుండా, కెరీర్‌లో మళ్లీ బలమైన స్థానం తీసుకొచ్చిన సినిమా అని చెప్పొచ్చు. చిన్న సినిమాగా వచ్చి, సైలెంట్‌గా విజయం సాధించిన 'శంబాల' ఇప్పుడు ట్రేడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## సంక్రాంతికి 'అనగనగా ఒక రాజు'తో రాబోతున్న మీనాక్షి చౌదరి .. పెళ్లి రూమర్స్‌పై పూర్తి క్లారిటీ



టాలీవుడ్‌లో తనదైన గుర్తింపుతో దూసుకెళ్తున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి ఈ సంక్రాంతికి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. నవీన్ పొలిశెట్టితో కలిసి నటించిన తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు' జనవరి 14న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడగా, ప్రమోషన్స్‌లో భాగంగా మీనాక్షి ఇచ్చిన తాజా ఇంటర్వ్యూ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్, పాత్రల ఎంపిక, అలాగే వ్యక్తిగత జీవితం గురించి వస్తున్న రూమర్స్‌పై స్పష్టంగా స్పందించారు. ఇటీవల 'లక్కీ భాస్కర్' చిత్రం తర్వాత తల్లి పాత్రలు చేయనని మీనాక్షి వ్యాఖ్యానించారంటూ ప్రచారం జరిగింది. ఈ విషయంపై ప్రశ్నించగా ఆమె స్పష్టంగా ఖండించారు."అలాంటి కామెంట్స్ నేను ఎక్కడా చేయలేదు. రూమర్స్‌ను ఎలా సృష్టిస్తారో నాకు అసలు అర్థం కావడం లేదు. నేను చెప్పని మాటలను నా పేరుతో ప్రచారం చేయడం బాధగా ఉంది" అని ఆమె అన్నారు. తన పాత్రల ఎంపికపై కూడా మీనాక్షి క్లారిటీ ఇచ్చారు. "నేను ఎప్పుడూ కథకు, పాత్రకు ప్రాధాన్యం ఇస్తాను. కథ బాగుంటే, పాత్రకు బలం ఉంటే  అది ఏ క్యారెక్టర్ అయినా చేయడానికి సిద్ధమే. హీరోయిన్, సపోర్టింగ్, క్యారెక్టర్ రోల్స్ అన్న భేదం నాకు లేదు" అని తెలిపారు. ఇటీవల మీనాక్షి పెళ్లి గురించి మీడియాలో, సోషల్ మీడియాలో జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. టాలీవుడ్‌కు చెందిన ఓ యువ హీరోతో ఆమె ప్రేమలో ఉన్నారని, ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని కథనాలు వచ్చాయి. దీనిపై మీనాక్షి కాస్త భావోద్వేగంగా స్పందించారు.నేను పెళ్లి చేసుకోబోతున్నానని ఎన్నో వార్తలు చూశాను. నిజంగా ఈ రూమర్స్ విని అలసిపోయాను. వాటిలో ఎలాంటి నిజం లేదు. నేను ఇప్పుడే పెళ్లి చేసుకునే ఆలోచనలో లేను" అని తేల్చిచెప్పారు.




## ది రాజాసాబ్' నుంచి ఆ రెండు సీన్లు కట్.. రన్‌టైమ్ ఎంతంటే?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన తొలి హారర్ కామెడీ థ్రిల్లర్ 'ది రాజాసాబ్'.  మారుతి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. విలన్ పాత్రలో సంజయ్‌దత్ కనిపించబోతున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.  ఫ్యాన్స్ కోసం ఒకరోజు ముందే..అనగా జనవరి 8న సాయంత్రమే ప్రీమియర్స్ వేయబోతున్నారు. ఇటీవల ఈ మూవీ సెన్సార్ పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ మూవీ రన్ టైమ్ బయటకు వచ్చింది. ఈ సినిమా రన్‌టైమ్ 189 నిమిషాలు. అంటే 3 గంటల 9 నిమిషాల నిడివితో ప్రేక్షకులను అలరించబోతుంది.  ఇక ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చిన సెన్సార్ సభ్యులు.. సినిమా మొత్తంలో రెండు కట్స్ మాత్రమే చెప్పారట. సినిమాలో తల నరికే సీన్‌తో పాటు నేలపై ఎక్కువ రక్తం కనిపించే సన్నివేశాన్ని తొలగించాలని సూచించారు. దీంతో ఆ రెండు సీన్స్ సినిమాలో నుంచి తొలగించిన 189 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారట.  బాహుబలి తర్వాత పాన్ ఇండియా సినిమాలన్నీ దాదాపు మూడు గంటల నిడివితోనే రిలీజ్ అవుతున్నాయి. బాహుబలి తర్వాత ప్రభాస్ నుంచి వచ్చిన చిత్రాలన్నీ దాదాపు ఎక్కువ రన్‌టైమ్‌నే కలిగి ఉన్నాయి. ఇప్పుడు ది రాజాసాబ్ కూడా అత్యధిక నిడివితో విడుదల కాబోతుంది.  హారర్ కామెడీతో ప్రేక్షకులను మూడు గంటలు కూర్చోబెట్టడం కాస్త రిస్కే  ఏమాత్రం తేడా వచ్చిన ఫలితం తారుమారు అవుతుంది. 'రాజాసాబ్' మాత్రం రిస్క్ చేసి మరీ పెద్ద నిడివితో వస్తున్నాడు.  ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.



## బాలయ్య సినిమా నుండి స్టార్ హీరోయిన్ ఔట్.. అదే కారణమా?




తెలుగు సినీ పరిశ్రమలో ఎనర్జీకి, మాస్ ఇమేజ్‌కు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన నటుడు నందమూరి బాలకృష్ణ. కెరీర్ నాలుగు దశాబ్దాలు దాటినా ఆయన జోరు మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఇటీవలి కాలంలో బాలయ్య చేస్తున్న సినిమాలు చూస్తే, ఆయన అభిమానులే కాదు సాధారణ ప్రేక్షకులు కూడా ఆశ్చర్యపోతున్నారు. 'అఖండ', 'వీర సింహారెడ్డి', 'భగవంత్ కేసరి', 'డాకు మహారాజ్' , అఖండ 2 వంటి చిత్రాలతో యాక్షన్‌తో పాటు భావోద్వేగాలను సమర్థంగా ప్రేక్షకులకు చేరువ చేశారు. అఖండ తొలి భాగం సాధించిన ఘన విజయం నేపథ్యంలో అఖండ 2 చిత్రం చేసిన బాలయ్య రీసెంట్‌గా ఈ చిత్రంతో ప్రేక్షకులని పలకరించారు. ఈ మూవీ ఓ మోస్తరు విజయాన్ని సాధించింది. ఇక ఇప్పుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో చిత్రం చేస్తుండగా, ఈ చిత్రాన్ని బీదీఖ111గా పిలుస్తున్నారు. ఇంతకుముందు ఈ కాంబినేషన్‌లో వచ్చిన 'వీర సింహారెడ్డి' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసింది. బాలయ్య స్క్రీన్ ప్రెజెన్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. అదే జోరును మరింత భారీ స్థాయిలో కొనసాగించాలనే ఉద్దేశంతో ఈసారి మరింత బలమైన కథతో ముందుకు వస్తున్నారని చిత్ర బృందం చెబుతోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సతీష్ కిలారు ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇది చారిత్రక నేపథ్యంతో కూడిన యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటుందని సమాచారం. బాలకృష్ణ ఇందులో రెండు విభిన్న కాలాల్లో కనిపించే పాత్రలు చేయనున్నారని, అందులో ఒకటి రాజుగా ఉండే పవర్‌ఫుల్ క్యారెక్టర్ అని టాక్ వినిపిస్తోంది. ఈ అంశమే అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. హీరోయిన్ ఎంపిక కూడా ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. బాలయ్య సరసన లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేయడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు రెట్టింపు అయ్యాయి. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు మంచి విజయాలు సాధించడంతో, ఈ జోడీ మళ్లీ తెరపై కనిపించబోతుండడం వార్త అభిమానుల్లో ఆనందాన్ని నింపింది. గత ఏడాది నవంబర్ 26న నయనతారను హీరోయిన్‌గా అధికారికంగా పరిచయం చేస్తూ మేకర్స్ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. అయితే ఇప్పుడు ఈ భామ తప్పుకున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. స్క్రిప్ట్ దశలో భారీ బడ్జెట్ అవుతుండడం, నయన్‌కి దాదాపు 8 కోట్ల రెమ్యునరేషన్ ఇవ్వాల్సి ఉండడం, మేకర్స్‌ని ఆలోచనలో పడేసిందట. వేరే హీరోయిన్ అయితే రెండు కోట్లతో అయిపోతుందని అనుకుంటున్నారట.

## జన నాయగన్ రిలీజ్ టైం.. మద్రాస్ హైకోర్టుకు విజయ్..!

కోలీవుడ్ స్టార్ యాక్టర్ దళపతి విజయ్ నటిస్తున్న చిత్రం జన నాయగన్ తెలుగులో ప్రజల నాయకుడు టైటిల్‌తో రాబోతున్న ఈ మూవీ జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కావాల్సి ఉంది. అయితే జననాయగన్ మూవీకి సెన్సార్ బోర్డ్ సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో విజయ్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాడు. రాజకీయ కారణాలతో సినిమాకు ఇబ్బందులు కలిగిస్తున్నారని టీవీకే ఆరోపిస్తోంది. కాగా విజయ్ పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు మధ్యాహ్నం విచారించనుంది. కార్తీ (ఖాకీ) ఫేం హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్నఈ చిత్రం తెలుగులో జన నాయకుడు టైటిల్ తో వస్తోంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడం.. విజయ్ టీం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించడం అభిమానులను కలవర పెడుతోంది. ఇంతకీ జననాయగన్ అనుకున్న టైంకు థియేటర్లలోకి వస్తుందా..? అంటూ తెగ చర్చించుకుంటున్నారు అభిమానులు, సినీ జనాలు. ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ లుక్, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రోడక్షన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ మూవీలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కీ రోల్‌లో కనిపించనున్నారు. మమితా బైజు, గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రకాష్ రాజ్, నరైన్, ప్రియమణి ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే విడుదలైన పాటలు సూపర్ హిట్‌గా నిలిచాయి. ఇటీవల మలేసియాలో 'జన నాయగన్' ఆడియో లాంచ్ కార్యక్రమం గ్రాండ్‌గా జరిగిందని తెలిసిందే. మొత్తంగా దళపతి విజయ్ కెరీర్‌కు ముగింపు పలికే ఈ సినిమా ఎలాంటి స్పందన రాబట్టుకుంటునేది ఆసక్తికరంగా మారింది.

Navataram Telugu Daily Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747,
Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State
Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com